
ఆంధ్రజ్యోతి



ANDHRAJYOTHY
ఖమ్మం
KHAMMAM
శనివారం, 12 జూలై 2025

67మంది లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు

- కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయింపు
- పారదర్శకంగా నిర్వహించాం : కలెక్టర్

6



ర్యాండమైజేషన్ పద్ధతిలో లబ్ధిదారులను ఎంపిక చేస్తున్న దృశ్యం

సేంద్రియ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

- ఎరువులు, రసాయనాలు లేని పంటలు పండించాలి
- మన పంటలు.. వంటలు.. దేశ, విదేశాలకు ఎగుమతవ్వాలి
- వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు
- ఖమ్మంలో తొలి సేంద్రియ రైతు బజార్ ప్రారంభం



మాట్లాడుతున్న మంత్రి తుమ్మల నాగేశ్వరరావు


ఖమ్మం, జూలై 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి): సేంద్రియ పంటల సాగు, ఉత్పత్తుల అమ్మకాలకు ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తుందని వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు. మళ్లీ తాతలు, తండ్రులనాటి వ్యవసాయం అనుకరించి సేంద్రియ పద్ధతిలో చిరుధాన్యాలతో పాటు ఆహార పంటలు పండించాలని, వాటితో వండిన వంటలు దేశ, విదేశాలకు ఎగుమతవ్వాలని ఆయన ఆకాంక్షించారు. దేశంలోనే తొలిసారిగా ఖమ్మం నగరంలోని 54వడివిజన్ వీడియోస్‌కాలనీలో ఏర్పాటు చేసిన సేంద్రియ రైతు బజార్‌ను మేయర్ పునుకొల్లు నీరజ, కార్పొరేటర్ మిక్కిలినేని మంజులతో కలిసి శుక్రవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులు అమ్మకానికి తెచ్చిన పలు సేంద్రియ సాగు కూరగాయలను మంత్రి పరిశీలించి అనంతరం జరిగిన సమావేశంలో మాట్లాడారు. సేంద్రియ పంటలు అందరికీ ఆరోగ్యకరమే కాకుండా రైతులకు ఆర్థికంగా లాభం చేకూరుస్తాయన్నారు. రసాయనిక ఎరువులు పురుగుమందుల వాడకంతో భూసారం తగ్గడంతో పాటు కూరగాయలు, తినే ఆహారం కలుషితమై క్యాన్సర్ మహమ్మారి (మిగతా 6వ పేజీలో)

'హస్తం'లో సందడి..

- ఇన్‌చార్జ్ వంశీచంద్‌తో తుమ్మల, రేణుక వేర్వేరుగా భేటీ
- భద్రాచలం, ఇల్లెందు, పినపాక ఎమ్మెల్యేలతో నియోజకవర్గాల వారీగా సమీక్షలు

6

20 నుంచి సాగర్ నీరు



జలకళ సంతరించుకున్న పాలేరు జలాశయం

- ఇప్పటికే నీటివిడుదలకు అధికారుల సన్నాహాలు
- ఆనందం వ్యక్తం చేస్తున్న రెండోజోన్ ఆయకట్టు రైతులు
- ఏళ్ల తర్వాత ముందుస్తుగా వస్తున్నాయంటూ హర్షం

కూసుమంచి, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : నాగార్జున సాగర్‌కు ఆశించిన రీతిలో ఎగువ నుంచి నీరొస్తోంది. దీంతో ఆయకట్టు రైతుల్లో ఆనందం వ్యక్తమవుతోంది. ఎన్నో ఏళ్ల తర్వాత ముందస్తుగా సాగునీరు వస్తుండటం.. రెండోజోన్ ఆయకట్టుకు ఈనెల 20తేదీనుంచి నీటిని విడుదల చేసేందుకు అధికారులు సన్నాహాలు చేస్తుండటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సాగర్ ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 590అడుగులు కాగా.. శుక్రవారం నాటికి 543.60 అడుగులకు చేరింది. అయితే జిల్లా తాగునీటి అవసరాలకోసం ఇప్పటికే నాగార్జున సాగర్ నుంచి పాలేరు జలాశయానికి విడుదల చేస్తున్న నీటిని కొనసాగించనున్నారు. వారం రోజుల క్రితం ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్ జిల్లాల ప్రజలకు తాగునీటి అవసరాల నిమిత్తం ఒక టీఎంసీ నీటిని విడుదల చేసిన సంగతి తెలిసిందే. ఈ క్రమంలో సాగర్‌కు వరద రాక, నీటి నిల్వ పెరిగినందున ఆయకట్టుకు ముందుగానే నీరు విడుదల చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈమేరకు సాగర్ జలాల విడుదలపై హైదరాబాద్‌లో శుక్రవారం శివమ్ కమిటీ సమావేశంలో.. వానాకాలం సాగుకు ఇప్పటినుంచే అవసరమైన నీటిని వాడుకోవాలని నిర్ణయించినట్లు తెలిసింది. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకుని ఏటా వానాకాలం సాగుకు అధికారులు ఆగస్టు రెండోవారంలో నీటిని విడుదల చేస్తారు. అయితే కృష్ణాపరీవాహక ప్రాంతంలో ప్రాజెక్టులన్నీ నిండుకుండల్లా మారడంతో ఎన్నో ఏళ్ల తరువాత జూలై మూడోవారంలోనే నీరు విడుదల చేస్తున్నారు. ఇప్పటికే మొదటిజోన్ పరిధిలో మేజర్లకు నీటిని విడుదల చేస్తున్నారు. గతేడాది అక్టోబరులో భారీ వరదలు రావడంతో సాగర్ గేట్లు ఎత్తి నీటిని సముద్రంలోకి వదిలారు. ఈసారి నీటిని వృథా చేయకుండా రైతులు వినియోగించుకునేలా పక్కా ప్రణాళికను సిద్ధం చేస్తున్నారు. ఇదిలా ఉంటే పాలేరు జలాశయానికి మూడువేల క్యూసెక్కుల నీరు వస్తోంది. జలాశయం నీటిమట్టం 23 అడుగులు కాగా ప్రస్తుతం 19.5అడుగుల నీరుంది. రెండోజోన్ పరిధిలో సాగర్ జలాలు విడుదలైన పక్షంలో ఖమ్మంజిల్లాలో 2.55 లక్షల ఎకరాలు ఆయకట్టు సాగవుతుంది.

యూటీ స్లాబు పనులు పూర్తి

పాలేరు జలాశయం వద్ద సాగర్ ఎడమకాల్వపై 132 కిలోమీటరు వద్ద చేపట్టిన అండర్ టన్నెల్((యూటీ) స్లాబు నిర్మాణం పూర్తయింది. స్లాబును మూడు విభాగాలుగా చేపట్టి నిర్మాణాన్ని పూర్తిచేశారు. సుమారు 73మీటర్ల పొడవు, 12 మీటర్ల వెడల్పుతో నిర్మించారు.

ఈనెల 20తేదీ నాటికి రెండోజోన్‌కు నీరు

మంగళపూడి వెంకటేశ్వర్లు, ఇరిగేషన్ ఎస్ఈ

సాగర్ రెండోజోన్ ఆయకట్టుకు ఈనెల 20నుంచి నీరు విడుదల చేసే అవకాశం ఉంది. కృష్ణా పరివాహకంలో ఆశించిన మేర వరద వస్తుండటంతో కొద్దిరోజుల్లోనే సాగర్ నిండే అవకాశం కనిపిస్తోంది. మున్ముందు నీరు వృథాగా సముద్రంలో కలవకుండా ముందే సాగునీటి కోసం వాడుకోవాలని శివమ్ కమిటీ నిర్ణయించింది. ఇక పాలేరు యూటీని 18కల్లా పూర్తి చేస్తాం. ఇప్పటికే స్లాబునిర్మాణం పూర్తయి.. కట్టబలోపేతం పనులు జరుగుతున్నాయి.

ఆశల తడి కోసం..



కల్లూరు మండలం బోడిమల్లెలో నీరు లేక నెర్రెలిచ్చిన వరి మైరు

- కాలం కలిసొస్తుందని రైతుల 'ముందస్తు' సాగు
- ఇప్పుడు వానల్లేక, సాగు నీరు రాక ఆందోళన
- కల్లూరు ప్రాంతంలో ఎండుతున్న నారుమడులు
- సాగు నీరిచ్చి రక్షించాలని కోరుతున్న ఆయకట్టు రైతులు

7



బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శం

- స్థానిక సంస్థల్లో 42శాతం హామీని సీఎం, రాహుల్ నెరవేర్చారు
- కేంద్ర మాజీ మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి

ఖమ్మం, జూలై 11 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి) : దేశంలో ఎక్కడా లేని విధంగా బీసీలకు 42శాతం స్థానిక సంస్థల్లో రిజర్వేషన్ కల్పిస్తూ తీసుకున్న నిర్ణయం దేశానికే ఆదర్శమని కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పేర్కొన్నారు. కేసు వాయిదా కోసం శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆమె కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. బీసీలకు ఇచ్చిన హామీ మేరకు సీఎం రేవంత్‌రెడ్డి, రాహుల్‌గాంధీ స్థానికసంస్థల్లో 42శాతం రిజర్వేషన్ కల్పించడం పట్ల హర్షం వ్యక్తంచేశారు. నాడు రాజీవ్‌గాంధీ స్థానిక సంస్థల్లో మహిళలకు 33శాతం రిజర్వేషన్లు కల్పిస్తే.. ఇప్పుడు రాహుల్‌గాంధీ స్థానిక సంస్థల్లో వెనుకబడిన వర్గాలకు 42శాతం కలిపించిన ఘనత దక్కిందని గుర్తుచేశారు. నాడు రాజీవ్‌గాంధీ ఇచ్చిన (మిగతా 6వ పేజీలో)

బుల్లెట్ బండిపై... మావోల అడ్డాలోకి..

- చర్ల మండలం పూసుగుప్పలో భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ పర్యటన
- మొబైల్ వైద్యశాల, అంబులెన్స్ ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావు
- సేవలు వినియోగించుకోవాలని సూచన

7



ద్విచక్ర వాహనంపై పూసుగుప్ప వెళుతున్న భద్రాద్రి ఎస్పీ, ఎమ్మెల్యే, కలెక్టర్

విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యం

- 15 నాటికి యూనిఫాం, పాఠ్య పుస్తకాలు పంపిణీ చేయాలి
- విద్యాశాఖపై సమీక్షలో కలెక్టర్ అనుదీప్ ఆదేశాలు



అధికారులతో సమీక్షిస్తున్న కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ప్రతీ విద్యార్థిలో విద్యా ప్రమాణాలు పెంచడమే లక్ష్యంగా విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేయాలని కలెక్టర్ అనుదీప్ సూచించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో విద్యాశాఖ తీరుపై స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీజతో కలిసి సంబంధిత అధికారులతో సమీక్షించారు. విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాల పంపిణీ, ఎఫ్ఆర్ఎస్ అమలు, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ అభివృద్ధి పనులు, ఎఫ్ఎల్ఎన్ పురోగతి అంశాలపై చర్చించిన ఆయన పలు సూచనలు చేశారు. పిల్లలకు పంపిణీ చేసిన యూనిఫాం, పాఠ్య పుస్తకాల వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. మిగిలినవి 15వ తేదీకి పూర్తిచేయాలని ఆదేశించారు. పాఠశాలల్లో చేపట్టిన ఎన్‌రోల్ మెంట్, మౌలిక వసతుల కల్పన వివరాలు యూడీఐఎస్ఈ లో మండల విద్యా శాఖ అధికారులు అప్‌డేట్ చేయాలన్నారు. జూలై 18 నుంచి మండల స్థాయిలో ఆధార్ అప్‌డేట్ చేసేందుకు ప్రత్యేక క్యాంపులను ఏర్పాటు చేయాలని, ఈ క్యాంపులపై విద్యార్థులకు అవగాహన కల్పించి, ప్రతీ విద్యార్థి ఆధార్ కార్డు అప్ డేట్ అయ్యేలా చూడాలన్నారు. జిల్లాలో 71 శాతం ఫేస్ రికగ్నేషన్ సిస్టం (ఎఫ్ఆర్ఎస్) ద్వారా ఉపాధ్యాయుల, విద్యార్థుల నమోదు జరుగుతుందన్నారు. జీరో ఎఫ్ఆర్ఎస్‌లో అటెండెన్స్ ఉన్న పాఠశాలలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని, జిల్లా వ్యాప్తంగా కనీసం 95 శాతం ఎఫ్ఆర్ఎస్ విద్యార్థుల హాజరు శాతం ఉండాలని ఆదేశించారు. కాంప్లెక్స్ హెడ్మాస్టర్ తన పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలను నిత్యం తనిఖీ చేస్తూ అవసరమైన ఫీడ్‌బ్యాక్ అందించాలని అన్నారు. సమావేశంలో డీఈవో సత్యనారాయణ, సీఎంవో రాజశేఖర్, ఆర్అండ్‌బీ ఈఈ ఎం.పవార్, ఇంజనీరింగ్, మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

పట్టణ పేద మహిళలకు.. ఆర్థిక స్వావలంబన

- వంద రోజుల కార్యాచరణలో వడ్డీ రుణమాఫీకి కదలిక
- పదేళ్ల తర్వాత 4,446 ఎస్‌హెచ్‌జీలకు రూ.4.14కోట్ల మాఫీ
- జిల్లాలో 40 వేల మంది మహిళలకు ప్రయోజనం
- నివేదికలు సిద్ధం చేసిన మెప్మా పీడీ అభిషేక్ అగస్త్య

7

'మొక్క'వోని సంకల్పం!

- కోకోపిట్ పెల్లెట్స్‌తో ఉద్యాన పంటల పెంపకం
- కొణిజర్ల మండలం పల్లిపాడులో ఓ రైతు వినూత్న ప్రయత్నం

6

వరదల కాలం.. మారింది!

- గత నాలుగేళ్లుగా జూలైలోనే వరదలు..
- అంతకుముందు ఆగస్టులో...
- 2022 జూలై 16న 71.3 అడుగులు
- 32 ఏళ్లలో అదే అత్యధికం..



భద్రాచలం వద్ద గోదావరి ప్రవాహం



భద్రాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వర్షాకాలంలో గోదావరికి వరదలు రావడం సర్వసాధారణం. జూలై, ఆగస్టు సెప్టెంబరు నెలలు ఎంతో కీలకమైనా.. ప్రధానంగా భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం మూడో ప్రమాద హెచ్చరిక స్థాయిని దాటి నమోదయ్యే సందర్భాలు ఆగస్టులోనే అధికంగా ఉన్నాయి. కానీ క్రమంగా వరదల కాలం మారుతూ వస్తోంది. అందుకు నాలుగేళ్లుగా జూలైలోనే భారీ వరదలు వస్తుండటం నిదర్శనంగా నిలుస్తోంది. అయితే ఆగస్టులోనూ వరదలు కొనసాగుతున్నా.. ప్రధానంగా జూలైలోనే నదీ పరివాహక ప్రాంతవాసులకు ఇబ్బందులు అధికంగా ఉంటున్నాయి. 2022 జూలై 16న భద్రాచలం వద్ద నమోదైన 71.3 అడుగుల నీటిమట్టం గత 32 ఏళ్లల్లో అత్యధికం. ఈ సమయంలో వరద ముంపులో 79 గ్రామాలు చిక్కుకోగా 15,465 కుటుంబాలకు చెందిన 21వేల మంది నిర్వాసితులను 77 పునరావాస కేంద్రాలకు తరలించారు. 10,831 ఎకరాల్లో పంట నష్టం జరిగింది. కాగా భద్రాచలం, బూర్గంపాడు, చర్ల, దుమ్ముగూడెం, అశ్వాపురం మండలాలు ప్రభావానికి గురయ్యాయి. 1990లో 70.8 అడుగుల నీటిమట్టం నమోదైన తర్వాత మళ్లీ 2022లో 71.3 అడుగుల నీటిమట్టం నమోదైంది.

గత నాలుగేళ్లుగా ఇలా..

2021	జూలై 24న	48.6
2022	జూలై 16న	71.3
2023	జూలై 29న	56.1
2024	జూలై 27న	53.9
2025	జూలై 11న	37.4

(నీటిమట్టం పెరుగుతోంది)

38.8 అడుగుల నీటిమట్టం నమోదు

నీట మునిగిన రేకుల షెడ్డు, స్నాన ఘట్టాలు

ఎగువన కురిసిన భారీ వర్షాలతో భద్రాచలం వద్ద గోదావరి నీటిమట్టం గత 24 గంటల్లో పెరుగుతూనే వచ్చింది. గురువారం అర్ధరాత్రి 12 గంటలకు 30 అడుగులు ఉన్న ప్రవాహం శుక్రవారం ఉదయం 6 గంటలకు 33.3 అడుగులకు పెరిగింది. మధ్యాహ్నం 12 గంటలకు 35.4అడుగులు నమోదై రాత్రి 11 గంటలకు 38.8 అడుగులకు చేరింది. శుక్రవారం అర్ధరాత్రి, శనివారం కూడా ఈ పెరుగుదల కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు. కాగా ఎగువ నుంచి వస్తున్న ప్రవాహంతో భద్రాచలం వద్ద గోదావరి స్నానఘట్టాలతోపాటు మహిళలు దుస్తులు మార్చుకునేందుకు ఏర్పాటు చేసిన రేకుల షెడ్ మునిగింది. భక్తులు, పర్యాటకులు ఎలాంటి ప్రమాదాలకు గురికాకుండా గోదావరి తీరంలో గజ ఈతగాళ్లను మోహరించి.. మైకుల ద్వారా హెచ్చరికలు చేస్తున్నారు.

మునిగిన పర్ణశాల నారచీరలు



మునిగిన సీతమ్మ వారి విగ్రహం

6

67మంది లబ్ధిదారులకు 'డబుల్' ఇళ్లు



డబుల్ లబ్ధిదారుల ఎంపికలో పాల్గొన్న కలెక్టర్, హాజరైన లబ్ధిదారులు

- కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయింపు
- పారదర్శకంగా నిర్వహించాం : కలెక్టర్ అనుదీప్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించినట్లు ఖమ్మం కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి అన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో శుక్రవారం యాతాలకుంట, రేజర్ల, పినపాకలో ఉన్న డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మంత్రి ఆదేశాల ప్రకారం డబుల్ బెడ్ రూం ఇళ్ల లబ్ధిదారులకు కేటాయించాలనే ఉద్దేశ్యంతో ప్రభుత్వం కార్యాచరణ చేపట్టిందన్నారు. పైరవీలకు తావు లేకుండా పూర్తి పారదర్శకంగా ఇళ్ల కేటాయింపు చేపట్టామన్నారు.

67 డబుల్ బెడ్ రూమ్ ఇండ్లను లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతిలో కేటాయించామని అన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల కేటాయింపు పట్టాలను త్వరలో సత్తుపల్లి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో, మంత్రి చేతుల మీదుగా అందిస్తామన్నారు.

- సత్తుపల్లి నియోజకవర్గంలోని యాతాలకుంటలో 40, రేజర్లలో 20, పినపాకలో 7 మొత్తం 67 డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను గ్రామసభ ద్వారా ఎంపిక చేసిన లబ్ధిదారులకు కంప్యూటర్ ర్యాండమైజేషన్ పద్ధతి ద్వారా కేటాయించామన్నారు. కంప్యూటర్ ర్యాండమైజేషన్ జాబితా గ్రామంలో ప్రదర్శిస్తామని, జిల్లా వెబ్‌సైట్‌లో కూడా పెట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. ఈ సందర్భంగా యాతాలకుంట లబ్ధిదారులు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా కలగా ఉన్న సొంత ఇంటిని కలెక్టర్ వచ్చిన నెల రోజుల్లోనే సాకారం చేసినందుకు సంతోషంగా ఉందన్నారు. కార్యక్రమంలో కల్లూరు ఆర్డీవో ఎల్.రాజేందర్ గౌడ్, మూడు గ్రామాల డబుల్ బెడ్ రూమ్ ఇళ్ల లబ్ధిదారులు పాల్గొన్నారు.

ఇల్లు రాలేదని రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన

మధిర రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అధికార పార్టీ నాయకుల కక్షసాధింపు వల్ల తాము నిరుపేదలమైనప్పటికీ తమకు ఇందిరమ్మ ఇల్లు రాలేదని ఆరోపిస్తూ ఓ కుటుంబం రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళనకు దిగింది. మధిర మండలం దెందుకూరు గ్రామానికి చెందిన వెలిజాల శిరోమణి అనే మహిళ కుటుంబం శుక్రవారం రెవెన్యూ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. తాము రెక్కాడితే డొక్కాడని పేదలమని, తమకు ఇల్లు ఇవ్వకుండా అన్యాయం చేశారని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో ఇళ్ల మంజూరైన వారికే మళ్లీ తిరిగి ఇళ్లు ఇచ్చారని ఆరోపించారు. డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క స్పందించి తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు.



నిరసన తెలుపుతున్న దెందుకూరుకు చెందిన శిరోమణి కుటుంబసభ్యులు

జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలి

జూలూరుపాడు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం జాబ్ క్యాలెండర్‌ను తక్షణమే విడుదల చేయాలని, ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ, ఉద్యోగ పోస్టులను భర్తీ చేయాలని కోరుతూ ఏఐవైఎఫ్ మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం జూలూరుపాడులో వినూత్న నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. స్థానిక ఉన్నత పాఠశాలలో అంబేద్కర్ విగ్రహం ఎదుట నాయకులు నల్ల రిబ్బన్లు ధరించి మోకాళ్లపై నిలుచొని నిరసన తెలియజేశారు. ఏఐవైఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి ఎస్.కె.చాంద్‌పాషా, జిల్లా నాయకులు పసుపులేటి పవన్, చాపలమడుగు హర్షవర్ధన్, నాయకులు జశ్వంత్, రిషి, సంపత్, వెంకట్, యాకూబ్ పాషా తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా కోటి కుంకుమార్చన మహాయజ్ఞం ప్రారంభం

పాల్వంచ టౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : చింతలచెరువు శ్రీఆత్మలింగేశ్వరాలయంలో శుక్రవారం కోటి కుంకుమార్చన మహాయజ్ఞం వైభవంగా ప్రారంభమైంది. గణపతి పూజతో ప్రారంభమైన పూజలో చండీపీఠం వ్యవస్థాపకుడు బ్రహ్మశ్రీ దండిబొట్ల రామానుజన్ కుమార్‌శర్మ పాల్గొన్నారు. తొలిరోజు పూజలో పెద్ద ఎత్తున పాల్గొన్నారు. ప్రతి రోజూ ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు సహస్ర నామార్చనతోపాటు సామూహిక లలిత పారాయణం, సాయంత్రం 6 నుంచి 8 గంటల వరకు సామూహిక లలితా పారాయణం ఉంటుందని ఆలయ ధర్మకర్త మచ్చా శ్రీనివాస్ తెలిపారు.

స్పోర్ట్స్ కాంప్లెక్స్ ఎంపికలకు ఆహ్వానం

భద్రాద్రి డీవైఎస్‌వో పరంధామరెడ్డి

చుంచుపల్లి, జూలై11(ఆంధ్రజ్యోతి): స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ తెలంగాణ వారి ఆధ్వర్యంలో గచ్చిబౌలి, ఎల్‌బిస్టేడియంలో ప్రారంభానికి సిద్ధమౌతున్న స్పోర్ట్స్ కాంప్లెక్స్ 2025-2026 సంవత్సరానికి గాను హాకీ, అథ్లెటిక్స్, హ్యాండ్ బాల్, ఫుట్ బాల్ క్రీడల నందు బాల, బాలికలకు నిర్ణీత సంఖ్యలో ఎంపికలకు ఆహ్వానిస్తున్నామని డీవైఎస్‌వో పరందామరెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 12 నుండి 16 సంవత్సరాల వయస్సు ఉన్న తెలంగాణ క్రీడాకారులు మాత్రమే ఈ ఎంపికల్లో పాల్గొనాలన్నారు. హాకీ, అథ్లెటిక్స్‌కు సంబంధించి గచ్చిబౌలి స్పోర్ట్స్ కాంప్లెక్స్ నందు ఎంపికలుంటాయని,హ్యాండ్‌బాల్, ఫుట్ బాల్ ఎంపికలు ఎల్‌బి స్టేడియంలో జరుగుతాయన్నారు. ఆసక్తి గల క్రీడాకారులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. పూర్తి వివరాలకై జిల్లా ఐడిఓసి కార్యాలయంలోని యువజన క్రీడల కార్యాలయాన్ని సంప్రదించాలని తెలిపారు.



మొక్కవోని సంకల్పం!

- కోకోపిట్ పెల్లెట్స్‌తో ఉద్యాన పంటల పెంపకం
- తమిళనాడు నుంచి పెల్లెట్స్ దిగుమతి
- నీటి వినియోగంతో ఆరోగ్యకరమైన మొక్కల ఉత్పత్తి
- కొణిజర్ల మండలం పల్లిపాడులో ఓ రైతు వినూత్న ప్రయత్నం

కొణిజర్ల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రైతులు వినూత్న పద్ధతిని అనుసరిస్తున్నారు. రైతులకు తక్కువ ఖర్చుతో మొక్కలు అందించాలనే లక్ష్యంతో ఓ యువ రైతు వినూత్న పద్ధతితో ఉద్యాన పంటల మొక్కలను పెంచుతూ ఆదర్శంగా నిలుస్తున్నాడు. ఉద్యానశాఖ సలహాలతో పాలీహౌస్‌ను ఏర్పాటు చేసి కోకోపిట్ పెల్లెట్స్‌తో పండ్ల మొక్కలను పెంచుతున్నాడు. కోకోపిట్ ద్వారా మొక్కలను సాగు చేస్తే ప్లాస్టిక్ వాడకం తగ్గుతుంది. రైతులకు లాభసాటిగా ఉంటుంది. ఈ నేపథ్యంలో ఆ రైతు చేపట్టిన వినూత్న మొక్కల పెంపకంపై ప్రత్యేక కథనం..

వైరాకు చెందిన యువ రైతు కుర్రా మురళి కొణిజర్ల మండలం పల్లిపాడు సమీపంలో మెయిన్‌రోడ్డు పక్కన ఎకరం భూమిలో రెండు పాలీహౌస్‌లను ఏర్పాటు చేశాడు. ఒక్కొక్క పాలీహౌస్‌ను 20 కుంటల విస్తీర్ణంలో ఏర్పాటు చేయగా.. ఒక్కొక్క పాలీహౌస్‌కు రూ.1.20కోట్లు ఖర్చయినట్లు రైతు మురళి తెలిపాడు. 2020లో మొదటి పాలీహౌస్‌ను ఏర్పాటు చేయగా.. 2021లో రెండో పాలీహౌస్ ఏర్పాటు చేశాడు. పాలీహౌస్‌లో కోకోపిట్ పెల్లెట్స్‌కు కావలసిన సదుపాయాలను సమకూర్చాడు. గత ఐదేళ్లుగా ఈ పాలీహౌస్‌లో కోకోపిట్ పెల్లెట్స్ ద్వారా పండ్ల మొక్కలను పెంచి అవసరమైన రైతులకు విక్రయిస్తున్నాడు. జిఫ్ఫీ బ్యాగులలో అమర్చిన కోకోపిట్ పెల్లెట్స్‌ను ఒక్కొక్కటి రూ.5 ఖర్చుతో తమిళనాడు నుంచి తెప్పించాడు. ప్రస్తుతం కోకోపిట్ (కొబ్బరిపీచు)పెల్లెట్స్ ద్వారా ఇప్పటి వరకు బొప్పాయి మొక్కలను పెంచి విక్రయిస్తున్నాడు.

జిఫ్ఫీ సంచులు లేకుండా..

బొప్పాయి మొక్కలను జిఫ్ఫీ బ్యాగులతో పెంచుతుండగా జిఫ్ఫీ సంచులు లేకుండా ప్రోట్రైలలో టమాటా, వంగ వంటి ఉద్యాన మొక్కలను పెంచుతున్నాడు. వీటితో పాటు రైతులకు కోకోపిట్‌తోనే మిరపనారు ఇవ్వాలని వాటిని కోకోపిట్ ద్వారా పెంచుతున్నాడు. మిరప, టమాట పంటలకు జిఫ్ఫీ బ్యాగులతో అయితే ఎకరానికి 12వేలు మొక్కలు పెట్టాల్సి ఉంటుంది. బొప్పాయికి ఎకరానికి వెయ్యి మొక్కలే సరిపోతాయి. రైతులకు ఖర్చు ఎక్కువగా వస్తుందని జిఫ్ఫీ సంచులు లేకుండా ప్రో ట్రైలలో మిర్చి, టమాట, వంగ వంటి నారు పెంచుతున్నారు. రైతులకు కూడా ఈ మూడు పంటల మొక్కలు ఒకటి రూ.1.50 మాత్రమే పడుతుంది. అదే బొప్పాయి మొక్క ఒకటి రూ.15లకు విక్రయిస్తున్నారు. బొప్పాయి మొక్కల పెంపకానికి రూ.13లు ఖర్చు వస్తుండగా పెంచిన రైతుకు రూ.2లే మిగులుతాయి. అయినా వినూత్న పద్ధతిలో రైతులకు అందించాలనే లక్ష్యంతో మొక్కలను పెంచుతున్నట్లు రైతు తెలిపాడు.



మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యాన శాఖాధికారి వేణు



మొక్కల పెంపకానికి కోకోపిట్ పెల్లెట్స్ ఒక వరం

ఆకుల వేణు, ఉద్యానశాఖాధికారి, వైరా

కోకోపిట్ పెల్లెట్స్ అనేవి కొబ్బరిపీచును అధిక ఒత్తిడికి గురిచేయడం వల్ల పెల్లెట్స్‌గా తయారవుతాయి. విత్తనాలు నాటడంతో పాటు అంటుమొక్కల ప్రవర్ధం కోసం, హైడ్రోపోనిక్స్ పద్ధతిలో అంటే మట్టిలో కాకుండా మొక్కలను పెంచడానికి ఉపయోగిస్తారు. తక్కువ నీటి వాడకంతో మొక్కలు పెంచొచ్చు. పాలీహౌస్‌లో విత్తనం నుంచి పంటకోత వరకు వీటిని ఉపయోగిస్తారు. ఈ విధానంలో వాయు ప్రసరణ అధికంగా జరిగి, నత్రజని, ఫాస్పరస్, పోటాషియం వేర్లు ఏపుగా పెరిగి మొక్కలు పెరుగుతాయి. వేరుకుళ్లు రోగం వచ్చే ఆస్కారం ఉండదు. మొక్కలను బ్యాగ్‌తో సహా నాటడం వల్ల మొక్కలు దెబ్బతినకుండా ఉంటాయి. రైతులు కూలీల ఖర్చును తగ్గించుకోవచ్చు. రైతులు ఈ విధానంలో ఉద్యానపంటలు సాగుకు ముందుకు వస్తే వారికి సలహాలు, సూచనలు ఇస్తూనే ఉంటాం.



సేంద్రియ ఉత్పత్తులను పరిశీలిస్తున్న తుమ్మల

సేంద్రియ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం

(5వ పేజీ తరువాయి)

బారిన పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. మిర్చి, పత్తి, కూరగాయలతో పాటు పలు పంటల్లో ఎరువులు, క్రిమి సంహారక మందులు ఎక్కువగా వాడటం వల్ల ఆ పంటలను పరీక్షించి విదేశాల వారు వెనక్కి పంపుతున్నారని, సేంద్రియ పంటలకు ఆ ఇబ్బంది ఉండదన్నారు. దేశంలో ఎక్కడా లేని విధంగా ఖమ్మంలో తొలి సేంద్రియ రైతుబజార్‌ను ప్రారంభిస్తున్నామని, దశలవారీగా రాష్ట్రంలోని అన్ని నగరాల్లో, మునిసిపల్ పట్టణాల్లో ఏర్పాటుచేసేందుకు కృషి చేస్తున్నామన్నారు. సేంద్రియ వ్యవసాయానికి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం అన్ని విధాలా ప్రోత్సాహం అందిస్తుందని భరోసా ఇచ్చారు. ఈ రైతుబజార్‌లో సేంద్రియ కూరగాయలు, ఆహార ఉత్పత్తులతోపాటు చేతివృత్తులతో తయారుచేసిన వస్తువుల స్టాళ్లు కూడా ఏర్పాటుచేయాలని కోరారు. ఆయిల్‌పామ్ సాగు చేసే రైతులకు ప్రభుత్వం అండగా ఉంటోందని, రూ.51వేల వరకు సబ్సిడీ అందిస్తామని తెలిపారు. అదనపు కలెక్టర్ శ్రీజ మాట్లాడుతూ ఖమ్మం సేంద్రియ రైతుబజార్ విజయవంతంగా నిర్వహించాలని, కార్పొరేషన్ నుంచి దీనిపై విస్తృత ప్రచారం కల్పించాలన్నారు. ఖమ్మం మేయర్ పునుకొల్లు నీరజ మాట్లాడుతూ మూసివేసిన మార్కెట్‌ను సేంద్రియ రైతుబజార్‌గా మార్చి రైతులకు మంచి అవకాశం కల్పించారని, సేంద్రియ ఉత్పత్తుల వాడకంతో ఆరోగ్యం బాగుంటుందన్నారు. సేంద్రియ సాగును ప్రోత్సహిస్తున్న విద్యార్థిని తేజస్విని మాట్లాడుతూ భూసార పరిరక్షణకు ప్రతీ ఒక్కరు కృషిచేయాలని, రైతుల్లో అవగాహన పెంచుతూ సేంద్రియ సాగును పెంచేందుకు తన వంతు కృషి చేస్తున్నానన్నారు. రైతుసంఘం నాయకులు నల్లమల వెంకటేశ్వరరావు, కార్పొరేటర్ మిక్కిలినేని మంజుల మాట్లాడుతూ సేంద్రియ రైతుబజార్ ఏర్పాటు చేయడం ద్వారా ప్రతి ఒక్కరికి ఆరోగ్యకరమైన ఉత్పత్తులు, కూరగాయలు అందుబాటులోకి వస్తాయని, రైతులకు కూడా ఆర్థికంగా భరోసా లభిస్తుదన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, ఉద్యానశాఖ అధికారి మధుసూదన్, మార్కెటింగ్‌శాఖ ఏడీ ఎంఎ అలీమ్, మునిసిపల్ ఈఈ కృష్ణలాల్, సేంద్రియ రైతులు రామిరెడ్డి, రామారావు, తదితరులు పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్ బిల్లు దేశానికే ఆదర్శం

(5వ పేజీ తరువాయి)

అవకాశంతో ఎంతో మంది మహిళలు స్థానిక సంస్థల్లో పదవులు పొంది ఆతర్వాత అసెంబ్లీ, లోక్‌సభ, శాసనమండలి, రాజ్యసభ లాంటి చట్టసభల్లో అడుగుపెట్టారన్నారు. తన ఉద్యమం వల్లనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వం బీసీలకు 42శాతం రిజర్వేషన్లు కల్పించిందని ఎమ్మెల్సీ కవిత చేసిన ప్రకటనపై స్పందిస్తూ మీ నాన్న పాలనలో ఎందుకు రిజర్వేషన్లు కల్పించలేదో సమాధానం చెప్పాలన్నారు. బీఆర్ఎస్ నాలుగు కుంపట్ల పార్టీ అని ఎద్దేవాచేశారు.

నా తడాఖా చూపిస్తా..

కేసులు పెట్టించిన వారిని వదిలి పెట్టను

'నాపై నమోదైన కేసు తప్పుడు కేసని నిరూపణైంది. న్యాయం గెలిచింది. నాపై కేసు పెట్టించిన వారిని వదిలిపెట్టను. నా తడాఖా ఏంటో చూపిస్తా' అని కేంద్ర మాజీమంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి పేర్కొన్నారు. కేసు వాయిదా కోసం శుక్రవారం ఖమ్మం వచ్చిన ఆమె తీర్పు అనంతరం కాంగ్రెస్ ఖమ్మం జిల్లా కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తనపై కేసు పెట్టిన వారికి ఏమీ తెలియదని, వారి ద్వారా కొందరు నాపై కేసు పెట్టించారని, తాను న్యాయాన్ని నమ్ముకుని ఇప్పటి వరకు పోరాడానని, ఎలాంటి రాజీ ప్రయత్నాలు చేయలేదని, తప్పుడు చేయనప్పుడు ఎందుకు తలవంచాలన్నదే తన విధానమని స్పష్టం చేశారు. తనను ఇబ్బందులకు గురిచేయాలని కొందరు తప్పుడు కేసులు పెట్టించారని, వారిని మాత్రం ఎట్టి పరిస్థితుల్లో వదిలేదని లేదన్నారు. ఈవిలేకరుల సమావేశంలో సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, మార్కెట్ కమిటీ మాజీచైర్మన్ మానుకొండ రాధాకిషోర్ , ముస్తఫా, వెంకటరత్నం, తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు రేణుకాచౌదరి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు 42శాతం రిజర్వేషన్ల కల్పన పట్ల ఖమ్మంలో ర్యాలీ నిర్వహించి డప్పు వాయిద్యాలతో సంబరాలు నిర్వహించారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రేణుకాచౌదరి

రాజ్యసభ సభ్యురాలు రేణుకపై కేసు కొట్టివేత

ఖమ్మం లీగల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి) : 2014లో జరిగిన శాసనసభ ఎన్నికల్లో తనకు ఖమ్మం జిల్లా వైరా ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని మోసం చేశారంటూ కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రస్తుత రాజ్యసభ సభ్యురాలిపై అప్పట్లో భూక్యా రాంజీ అనే వ్యక్తి సతీమణి కళావతి ఖమ్మం కోర్టులో ప్రైవేట్ కేసు దాఖలు చేశారు. అనంతరం ఆ కేసు విచారణ చేపట్టిన ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక న్యాయస్థానం పలువురు సాక్షులను విచారించింది. ఈ క్రమంలో నేరం రుజువు కాకపోవడంతో శుక్రవారం రేణుకచౌదరిని నిర్దోషిగా విడుదల చేస్తూ ఎస్సీ, ఎస్టీ కోర్టు ప్రత్యేక న్యాయస్థానం న్యాయమూర్తి దేవినేని రాంప్రసాద్‌రావు తీర్పు వెల్లడించారు. రేణుకాచౌదరి తరఫున సీనియర్ న్యాయవాదులు ఎం.నిరంజన్‌రెడ్డి, మద్ది శ్రీనివాస్‌రెడ్డి వ్యవహరించారు. కోర్టు రేణుకాచౌదరిని నిర్దోషిగా ప్రకటించడం పట్ల ఖమ్మం కాంగ్రెస్ లీగల్ సెల్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు.



కరకట్ట స్లూయిస్ వద్దకు చేరిన నీరు

మునిగిన పర్ణశాల నారచీరలు

దుమ్ముగూడెం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): గోదావరికి వస్తున్న వరదతో ప్రముఖ పుణ్యక్షేత్రం పర్ణశాల నారచీరల ప్రాంతం శుక్రవారం రాత్రి మునిగింది. సీతమ్మ వారి విగ్ర హాన్ని వరదనీరు చుట్టుముట్టింది. దుమ్ముగూడెం గోదావరి హెడ్‌లాకుల వద్ద 18 అడుగులకు నీటిమట్టం చేరింది. దీంతో దుమ్ముగూడెం శ్మశానవాటిక సమీపంలో కరకట్ట స్లూయిస్ వద్ద రెండుచోట్ల వరద పెర్గా.. గ్రామంలోనికి నీరు చేరకుండా అధికారులు స్లూయిస్‌కు రక్షణగా ఇసుక బస్తాలను ఏర్పాటు చేశారు.

యూరియా కొరత లేదు : భద్రాద్రి డీఏవో

గుండాల, జూలై 11 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఎరువుల కొరత లేదని, వానాకాలం సాగుకు సరిపడా ఎరువులన్నీ అందుబాటులో ఉన్నాయని, రైతులు ఆందోళన చెందొద్దని జిల్లా వ్యవసాయశాఖ అధికారి (డీఏవో) బాబూరావు అన్నారు. గుండాల మండల కేంద్రంలోని పీఏసీఎస్‌ను శుక్రవారం ఆకస్మికంగా సందర్శించిన ఆయన ఎరువుల పంపిణీ, యూరియా నిల్వలను పరిశీలించారు. రికార్డులు తనిఖీ చేశారు. యూరియా పంపిణీలో రైతులకు ఇబ్బందులు తలెత్తకుండా రెండు కౌంటర్లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆయన మాట్లాడుతూ గోదాంలో 25మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందన్నారు. ఇప్పుడే ఏ పంటకు యూరియా వేయాల్సిన అవసరం లేదని, రైతులు అవసరం మేరకు దశలవారీగా యూరియా కొనుగోలు చేయాలన్నారు. యూరియా వాడకంలో నియంత్రణ పాటించి నానో యూరియా, నానో డీఏపీ వాడాలని సూచించారు. ఆయన వెంట గుండాల వ్యవసాయ అధికారి వెంకటరమణ, పీఏసీఎస్ సిబ్బంది ఉన్నారు.

నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలి: జడ్పీ డిప్యూటీ సీఈవో

జూలూరుపాడు, జూలై 11(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలతో పాటు లబ్ధిదారుల గృహాలలో చేపడుతున్న నిర్మాణాలను త్వరితగతిన పూర్తిచేయాలని, జడ్పీ డిప్యూటీ సీఈఓ చంద్రశేఖర్ రావు సూచించారు. శుక్రవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఈజీఎస్, మండల పరిషత్ సిబ్బందితో సమీక్ష సమావేశాన్ని ఆయన నిర్వహించారు. పెండింగ్‌లో ఉన్న పనుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. హరితవనాలు, కెనాల్‌బండ్ ప్లాంటేషన్లను త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ పడమటనర్సాపురం పాఠశాలలో కమ్యూనిటీ శానిటరి కాంప్లెక్స్ నిర్మాణాన్ని వెంటనే ప్రారంభించాలన్నారు. మండలంలో 224 మంది లబ్ధిదారులకు మరుగుదొడ్లు మంజూరయ్యాయని త్వరితగతిన పూర్తిచేయాలని సూచించారు. సమావేశంలో ఎంపీడీఓ కరుణాకర్‌రెడ్డి, సూపరింటెండెంట్ తాళ్లూరి రవి, ఎంపీఓ తులసీరాం, ఈజీఎస్ ఏపీఓ రవి పాల్గొన్నారు.

'హస్తం'లో సందడి..

పార్టీ ఇన్‌చార్జ్ వంశీచంద్‌తో తుమ్మల, రేణుక, ఎమ్మెల్యేల వేర్వేరు భేటీలు



వంశీచంద్‌రెడ్డిని సత్కరిస్తున్న మంత్రి తుమ్మల, నాయకులు

ఖమ్మం, జూలై 11 (ఆంధ్రజ్యోతిప్రతినిధి) : కాంగ్రెస్ జిల్లా కార్యాలయంలో శుక్రవారం కూడా సందడి కనిపించింది. పార్టీ ఉమ్మడి జిల్లా ఇన్‌చార్జ్ వంశీచంద్‌రెడ్డితో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు, రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి సహా పలువురు ఎమ్మెల్యేలు వేర్వేరుగా భేటీ అయ్యారు. మండల కమిటీ అధ్యక్ష పదవులకు సిఫార్సులు, నామినేటెడ్ పదవులకు పేర్లు జాబితా సిద్ధం చేస్తున్న నేపథ్యంలో ఒక్కొక్కరుగా ఇన్‌చార్జ్‌ను కలవడం ప్రాధాన్యం సంతరించుకుంది. వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వంశీచంద్‌రెడ్డిని కలిసి సత్కరించారు. పలువురు నాయకులు, ఎమ్మెల్యేలు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. అనంతరం తుమ్మల వంశీచంద్‌రెడ్డితో భేటీ అయి రాజకీయ పరిస్థితి వివరించారు. రాజ్యసభ సభ్యురాలు రేణుకాచౌదరి కూడా వంశీచంద్‌రెడ్డితో సమావేశమై పార్టీ వ్యవహారాలపై చర్చించారు. ఉమ్మడి జిల్లాకు చెందిన పలువురు ఎమ్మెల్యేలు, మహబూబాబాద్ లోక్‌సభ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పోట్ల నాగేశ్వరావు, మాజీ ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీనారాయణ, పార్టీ ప్రధాన కార్యదర్శులు కట్ల రంగారావు, మద్దినేని స్వర్ణకుమారి, నాగ సీతారాములు, ఎమ్మెల్యేలు రాందాస్‌నాయక్, మట్టా రాగమయి, ఖమ్మం, భద్రాద్రి జిల్లాల అధ్యక్షులు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, పొదెం వీరయ్య, ఎమ్మెల్యేలు పాయం వెంకటేశ్వర్లు, కోరం కనకయ్య , తెల్లం వెంకటరావు తదితరులు కలిసి నియోజకవర్గాల్లో పరిస్థితిని వివరించారు. కాంగ్రెస్ పార్టీ అనుబంధ సంఘాల నాయకులు తమకు ప్రాతినిధ్యం ఇవ్వాలని దరఖాస్తులు అందించారు. పీసీసీ మాజీ కార్యదర్శి వక్కలగడ్డ చంద్రశేఖర్ తాను భద్రాచలం కమిటీ డైరెక్టర్ పదవికి దరఖాస్తు చేశానని పరిశీలించాలని కోరారు. ఇతర నాయకులతోనూ మాట్లాడిన ఇన్‌చార్జ్ పార్టీ పరిస్థితి గురించి ఆరా తీశారు. ఈ క్రమంలో నాయకులు, ఎమ్మెల్యేలు నియోజకవర్గాలకు చెందిన అర్హుల జాబితాలు అందించారు. ఖమ్మం నగర అధ్యక్షుడు జావీద్, వర్కింగ్ ప్రెసిడెంట్ దీపక్‌చౌదరి తదితరులు కూడా ఇన్‌చార్జ్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

ప్రజలకు ప్రాధాన్యమివ్వని ప్రజా వేదిక

- మొక్కుబడిగా ఉపాధి హామీ సామాజిక తనిఖీ సభ

గుండాల, జూలై11(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో పారదర్శకతకు ప్రభుత్వం చేపడుతున్న సామాజిక తనిఖీ అధికారులు, సామాజిక తనిఖీ బృందాల అలసత్వంతో నీరుగారి పోతుంది. ప్రజల సమక్షంలో నిర్వహించాల్సిన ప్రజా వేదిక ప్రజలు లేక వెలవెల పోయింది. మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం అదనపు డీఆర్‌డీవో రవి ఆధ్వర్యంలో 16వ విడత సామాజిక తనిఖీ ప్రజావేదిక నిర్వహించారు. ప్రజా వేదిక నిర్వహణకు నిధులు లేవని మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధిహామీ సిబ్బంది, తనిఖీ బృందం అధికారులతో ప్రజావేదిక నిర్వహించారు. దీంతో ప్రజలు లేకుండానే ప్రజా వేదిక జరిగింది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో జరిగిన పనుల్లో మండలంలోని 11 పంచాయతీల్లో ఆడిట్ బృందాలు తనిఖీ నిర్వహించాయి. ఆయా పంచాయతీల్లో జరిగిన పనుల వివరాలు చదివి వినిపించారు. పనికి రాకపోయిన వారిక మస్టర్లు వేసి కూలి నగదు దుర్వినియోగం చేశారని, రికార్డులు నిర్వహించకుండా పనులు చేశారని తేల్చారు. పనుల వద్ద బోర్డులు ఏర్పాటు చేయలేదని బృందాలు పేర్కొన్నాయి. రికార్డుల నిర్వహణ, హాజరు తప్పులపై సంబధిత సిబ్బందికి రూ.11వేలు పెనాల్టీ, రూ.14,610 రికవరీ విధించడంతో పాటు షోకాజ్ నోటీసులు జారీ చేశారు.. బాధ్యులపై చర్యలు తీసుకుంటామని జరిమానాలు విధిస్తున్నామని, ప్రజా వేదికల ద్వారా నిధులను పారదర్శకంగా వినియోగించడంతో పాటు కూలీల హక్కులకు రక్షణ కలుగుతుందని అధికారుల చెబుతున్నారు.. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాలరాజు, డీపీవో రమణ, ఏపీవో అనుష, ఎంపీవో శ్యామ్ సుందర్, ఏపీవో రవి తేజ, ఉపాధి హామీ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



ప్రజావేదికలో నివేదికలు పరిశీలిస్తున్న అదనపు డీఆర్‌డీవో రవి

ప్లాస్టిక్ నివారణపై ప్రభుత్వ ఉద్యోగి ప్రచారం

- లక్ష కరపత్రాల పంపిణీయే లక్ష్యం
- ఊరూరా తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్న ఉద్యోగి శివ


జూలూరుపాడులో ర్యాలీ నిర్వహిస్తున్న దృశ్యం

జూలూరుపాడు, జూలై11(ఆంధ్రజ్యోతి): అతడొక ప్రభుత్వ ఉద్యోగి, అంతకుమించి సమాజ హిత మెంచిన ఒక పౌరుడు. ప్లాస్టిక్ వల్ల కలిగే దుష్పరిణామాలను ప్రజలకు అవగాహన కల్పిస్తూ ఊరూ వాడా ప్రచారం చేస్తున్నారు. పాపకొల్లు ఉన్నత పాఠశాలలో రికార్డు అసిస్టెంట్‌గా పని చేస్తున్న జూలూరుపాడుకు చెందిన తిప్పర్తి శివ. ప్లాస్టిక్ వినియోగంతో కలిగే అనార్థాలకు సంబంధించిన నినాదాలతో కూడిన లక్ష కరపత్రాలను తన సొంత ఖర్చులతో ముద్రించి గ్రామాలలో పంచి పెడుతున్నారు. ప్రచారంలో భాగంగా శుక్రవారం మండలంలోని జూలూరుపాడు, వెంగన్నపాలెం గ్రామాలలో దుకాణాల వద్దకు వెళ్లి కర పత్రాలను ఆయన పంపిణీ చేశారు. ప్రయాణికులకు, విద్యార్థులకు కరపత్రాలను అందించి ప్లాస్టిక్ నివారణ భాగస్వాములు కావాలని కోరారు. ప్లాస్టిక్ వద్దు గుడ్డ సంచులే ముద్దు అంటూ నినాదాలు చేస్తూ వారికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్లాస్టిక్ బూతం పర్యావరణాన్ని, మానవాళిని కబలించడం తనను కల్చి వేసిందని, భావి తరాల శ్రేయస్సు కోరి ప్లాస్టిక్ వ్యతిరేక యజ్ఞాన్ని తలపెట్టినట్లు తెలిపారు ఆరోగ్య జీవన యాత్ర బృందం సభ్యులు సంఘీభావం తెలియజేసి ప్రచారం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సభ్యులు వేల్పుల బోస్, రాయి బసవ, గుర్రం నవీన్, వేముల నాగేశ్వరరావు, యలమద్ది సురేష్, బండ్ల వెంకటేశ్వర్లు, సోడె శ్రీరామ్, షేక్ బుడేన్‌పాషా, యునానీ వైద్యాధికారి రాజేందర్, విశ్వేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

కూరగాయాలతో అమ్మవారికి ప్రత్యేక అలంకరణ



అశ్వారావుపేట రూరల్, జూలై 11(ఆంధ్రజ్యోతి): అశ్వారావుపేట మం డలంలోని గుర్రాలచెరువు గ్రామంలో స్వయంభూ శ్రీకనకదుర్గమ్మ ఆలయం లో శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆషాడమాస ప్రత్యేక పూజల్లో భాగంగా అమ్మవారిని కూరగాయలతో శాఖాంబరి రూపంలో అలంకరించారు. టమాటాలు, వంకాయలు, బెండకాయలు, క్యారెట్, బంగాళ దుంపలు, మిరపకాయలు, ఆకుకూరలు ఇలా 30 రకాలు, 100 కిలోల కూరగాయలతో అమ్మవారిని అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి వివిధ రకాల పూజలు నిర్వహించగా భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. కార్యక్రమంలో ఆలయధర్మకర్త మాగాపు వరలక్ష్మీ భవాని, నారాయణరావు, పోలిశెట్టి శ్రీనివాసరావు, వ్యాఘ్రేశ్వరావు, దుర్గాప్రసాద్, పెదరామకృష్ణ పాల్గొన్నారు.

వరదొస్తుంటే ప్రమాదమని తెలిసినా.. జల్సాలా

● పోలీసు నిఘా ఏదీ..?


గురువారం రాత్రి 10 గంటల సమయంలో నది ఒడ్డున ఉన్న వ్యక్తులు

భద్రాచలం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): భద్రాచలంలో ఒక వైపు గోదావరి వరద పెరుగుతూ ఉంటే రాత్రి 10 గంటల సమయంలో గోదావరి ప్రవాహం వద్ద పలువురు యువకులు హల్‌చల్ చేస్తున్నారు. వారు స్థానికులా, భక్తులా, లేక పర్యాటకులా అనేది తెలియడం లేదు. అయితే ఆదమరిస్తే జరగరానిది జరిగితే బాధ్యత ఎవరిది అని స్థానికులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా పోలీసు అధికారులు రాత్రి సమయంలో గోదావరి ఒడ్డున తగిన జాగ్రత్త చర్యలు తీసుకునేలా ఏర్పాట్లు చేయాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రాష్ట్రస్థాయి ఫుట్‌బాల్ పోటీల్లో ఖమ్మం జిల్లా జట్టుకు ద్వితీయ బహుమతి

ఖమ్మం స్పోర్ట్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): మంచిర్యాల జిల్లా రామక్రిష్ణాపూర్‌లో ఈనెల 8 నుంచి 11 వరకు జరిగిన రాష్ట్రస్థాయి జూనియర్ ఫుట్‌బాల్ పోటీలలో ఉమ్మడి ఖమ్మం జిల్లా బాలికల జట్టు ప్రతిభ చూపి ద్వితీయ బహుమతిని కైవసం చేసుకుంది. నిజామాబాద్ జిల్లా జట్టుపై జరిగిన ఫైనల్ పోటీలో స్వల్ప స్కోరు తేడాతో పోరాడి ఓటమి చెంది రన్నరప్ టైటిల్‌ను దక్కించుకున్నారు. అంతే కాకుండా జట్టు క్రీడాకారిణి శృతి టోర్నమెంట్ ఆదిత్యం అత్యుత్తమ ప్రతిభ చూపి టోర్నీ బెస్ట్ ప్లేయర్ అవార్డును సొంతం చేసుకోవడం విశేషం. ఈ సందర్భంగా రాష్ట్ర పోటీలలో విజయం సాధించిన జిల్లా క్రీడాకారులను, జట్టు కోచ్‌లు నోయల్ జాక్సన్, మాధురిని ఫుట్‌బాల్ అసోసియేషన్ జిల్లా సెక్రెటరీ కళ్యాణపు ఆదర్శ్‌కుమార్, డీవైఎస్‌వో సునీల్‌రెడ్డి తదితరులు అభినందించారు. భవిష్యత్ పోటీలలో విజయం సాధించి జిల్లా ఖ్యాతిని ఇనుమడింపచేయాలని ఆకాంక్షించారు.

పొలాల్లో దొరికిన రాతి విగ్రహం


స్వామివారి విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్న దృశ్యం

ఖమ్మంరూరల్, జూలై11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కాచిరాజుగూడెం గ్రామ పంచాయతీలోని రేగులతండాలో రైతుల పొలాల్లో ఓ రాయి దొరకగా దానిని రైతులు గెట్టు పక్కన పడేశారు. గ్రామంలో ఓ మహిళకు దేవుడు కలలో కనిపించి రైతు గట్టుపై ఉన్న రాయి స్వామివారిదని చెప్పడం జరిగింది. ఈ విషయాన్ని గ్రామస్థులకు తెలియచేయగా గ్రామస్థులు వెళ్లి అట్టి రాయిని పరిశీలించగా రాయిపై ఆంజనేయస్వామి, సుబ్రమణ్యస్వామి వార్ల రూపాలతో ఉంది. వెంటనే గ్రామస్థులు పూజారులను పిలిపించి చూపించగా ఆంజనేయస్వామి, సుబ్రమణ్యస్వామి, పాముపడగల ప్రతిరూపాలు ఉన్నాయి. పూజారులు స్వామివిగ్రహమే అని చెప్పడంతో గ్రామస్థులు అట్టి స్వామివారి విగ్రహాన్ని శుక్రవారం గ్రామంలోకి తీసుకువచ్చి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేసి ప్రతిష్ఠించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భాస్కర్, సంతు పాల్గొన్నారు.

పట్టణ పేద మహిళలకు..

ఆర్థిక స్వావలంబన

- వంద రోజుల కార్యాచరణలో వడ్డీ రుణమాఫీకి కదలిక
- పదేళ్ల తర్వాత 4,446 ఎస్‌హెచ్‌జీలకు రూ.4.14కోట్లు మాఫీ
- ఖమ్మం జిల్లాలో 40వేల మంది మహిళలకు ప్రయోజనం
- నివేదికలు సిద్ధం చేసిన మెప్మా పీడీ అభిషేక్ అగస్త్య


మహిళ సంఘాలకు బ్యాంకు లింకేజీ పంపిణీ చేస్తున్న మంత్రి తుమ్మల (ఫైల్)

ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మహిళలను ఆర్థికంగా, సామాజికంగా ప్రభుత్వం తోడ్పాటు ఇచ్చే లక్ష్యంతో ఉమ్మడి రాష్ట్ర ముఖ్యమంత్రిగా ఎన్టీఆర్ పనిచేసిన కాలంలోనే డ్వాక్రా సంఘాల నిర్మాణం జరిగింది. పది మంది మహిళలతో సంఘాన్ని ఏర్పాటు చేసి వారు చేసే చేతి వృత్తుల ఆధారంగా బ్యాంకు ద్వారా ప్రభుత్వం రుణాలను అందించి సబ్సిడీలను అందించింది. తర్వాత కాలంలో వచ్చిన ప్రభుత్వాలు సబ్సిడీలను తొలగించి వడ్డీ మాఫీకి శ్రీకారం చుట్టాయి. అయితే గత బీఆర్ఎస్ ప్రభుత్వంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు పదేళ్ల పాటు వడ్డీ మాఫీ పథకం అమలు కాలేదు. ఏడాదిన్నర క్రితం అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి మహిళ స్వయం సహాయక సంఘాలకు వడ్డీ లేని రుణాలపై ఆశలు కల్పించింది. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న వంద రోజుల కార్యాచరణలో భాగంగా మహిళా స్వయం సహాయక సంఘాలకు వడ్డీ మాఫీచేయాలని నిర్ణయించింది. దీంతో ఖమ్మం మెప్మా ప్రాజెక్టు డైరెక్టర్ అభిషేక్ అగస్త్య ఆదేశాల మేరకు ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లోని మెప్మా డీఎంసీ సావల సుజాత, టీఎంసీ గుడిపూడి సుజాతరాణి ఆధ్వర్యంలో మిత్తి మాఫీ కార్యాచరణ రూపొందించారు. 2023-2024లో 2,372 ఎస్‌హెచ్‌జీలు, 2024-2025మార్చి వరకు 2,072 సంఘాలు అర్హత సాధించాయి. ఆర్థిక క్రమశిక్షణ పాటిస్తున్న సంఘాల్ని గుర్తించారు. వడ్డీమాఫీ కావాలంటే మహిళ స్వయం సహాయక సంఘాలు తాము తీసుకున్న రుణాలను ముందుగా వడ్డీతో సహా పూర్తిగా బ్యాంకులకు సరైన సమయానికి చెల్లింపులు జరపాలి. ఆ చెల్లింపులు ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో ఆర్పీలు, కమ్యూనిటీ ఆర్గనైజర్లు చేయాల్సి ఉంటుంది. ఇలా ఆర్థిక క్రమశిక్షణ నిబంధనలు పాటించిన మెప్మా పరిధిలోని 4,446 మహిళా స్వయం సహాయక సంఘాల్ని గు ర్తించారు. ప్రభుత్వం ద్వారా రూ.4.14కోట్ల పైచిలుకు అందించేందుకు నివేదికలను సిద్ధం చేశారు. దీంతో ఖమ్మం, సత్తుపల్లి, మధిర, వైరా మున్సిపాలిటీల్లోని 4,446 మహిళా స్వయం సహాయక సంఘాల్లో 40వేల మంది మహిళలకు వడ్డీ మాఫీ కానుంది. కాగా గ్రామీణాభివృద్ధిలోని సెర్ప్ మహిళా స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీ మాఫీ వివరాలపై జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారులు స్పందించ లేదు. వివరాలు గోప్యంగా ఉంచటంతో గ్రామీణ ప్రాంతాల్లోని మహిళా స్వయం సహాయక సంఘాలు తమకు వడ్డీ మాఫీ అవుతుందా? లేదా? అని ఎదురుచూస్తున్నారు.

పదేళ్లుగా పైసా రాక డీలా

ఉమ్మడి రాష్ట్రంలో నాటి టీడీపీ, కాంగ్రెస్‌ల హయాంలో మహిళా స్వయం సహాయక సంఘాలకు పెద్దపీట వేశాయి. ఆర్థికంగా స్వావలంబనకు మహిళలకే రుణాలను అందించి వారికి వృత్తిపరమైన, లేదా వారు కోరిన ఆదునికమైన వ్యాపారాల్లో శిక్షణ ఇచ్చి బ్యాంకుల ద్వారా రుణాలను అందించారు. సబ్సిడీలను ఇచ్చారు. తర్వాత వడ్డీ మాఫీలు చేయటంతో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణ ప్రాంతాల వరకు మహిళలు మైక్రోఫైనాన్స్, ప్రైవేట్ వడ్డీ వ్యాపారస్థులను ఆశ్రయించకుండా బ్యాంకు లింకేజీలు, స్త్రీనిధి రుణాలను పొందారు. అయితే గత పదేళ్ల కాలంలో వడ్డీ మాఫీ కాలేదు. దీంతో మహిళా సంఘాలకు ఆర్థికంగా పెద్దగా ప్రయోజనం రాలేదు. బ్యాంకుల వడ్డించే రూ.1 నుంచి రూ.1.50 మిత్తి చెల్లిస్తూ వందల సంఖ్యలో మహిళ సంఘాలు కనుమరుగైనాయి. మళ్లీ కాంగ్రెస్ ప్రభుత్వం వంద రోజుల కార్యక్రమంలో వడ్డీ మాఫీ పథకంపై రాష్ట్ర ప్రభుత్వం ప్రకటనలు చేయటంతో మహిళ స్వయం సహాయక సంఘాలకు సంతోషం వ్యక్తం చేశాయి.

మున్సిపాలిటీ	వడ్డీ మాఫీకి అర్హత పొందిన సంఘాలు
ఖమ్మం	2,923
మధిర	676
సత్తుపల్లి	319
వైరా	528

నేడు విద్యార్థులకు ప్రతిభా పురస్కారాల అందజేత

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఉమ్మడి ఖమ్మంజిల్లాలో పది, ఇటర్, ఐఐటీలో అత్యుత్తమ మార్కులు సాధించిన పెరిక కుల విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు శనివారం అందిస్తున్నట్లు పెరిక కుల (పురగిరి క్షత్రియ) సేవా సంఘం జిల్లా అధ్యక్షుడు గజ్జవెల్లి సత్యనారాయణ, జిల్లా గౌరవ అధ్యక్షుడు బంధుసూర్యం పేర్కొన్నారు. శుక్రవారం ఖమ్మం నగరంలోని సంఘం కార్యాలయంలో నిర్వహించిన ముఖ్యనాయకుల సమావేశంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పది,ఇంటర్‌లో అత్యధిక మార్కులు సాధించిన పెరికు కుల విద్యార్థులకు ప్రోత్సాహకర, ప్రతిభా పురస్కారాలు అందిస్తున్నట్లు తెలిపారు. పెరిక కుల బంధువులందరూ ఈకార్యక్రమానికి హాజరై విజయవంతం చేయాలని వారు కోరారు. ఈకార్యక్రమంలో చింతల లింగేశ్వరరావు, ముత్తినేని రత్నాకర్, పత్తిపాక వెంకటేశ్వర్లు, గజ్జల వెంకన్న, పాయల నాగేశ్వరరావు, నాగేశ్వరరావు, మల్లెల, అప్పారావు, అర్తి గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.

గల్లంతైన శ్రీనివాస్ మృతదేహం లభ్యం

రేగుల గండిలో విషాదం

మణుగూరుటౌన్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సింగరేణి కాలరీస్ మణుగూరు ఏరియలోని ఓసీ-2 గనిలో ఈపీ ఆపరేటర్‌గా పనిచేస్తున్న సుంకరి శ్రీనివాస్ మృతదేహం శుక్రవారం లభ్యమైంది. బుధవారం రేగులగండి చెరువులో ఆయన గల్లంతైన విషయం తెలిసిందే. అతడి ఆచూకీ కోసం తహసీల్దార్ నరేష్, సీఐ పాటి నాగబాబు, అగ్నిమాపక సిబ్బంది, భద్రాచలం నుంచి వచ్చిన ఎన్‌డీఆర్ఎఫ్, ఎస్‌డీఆర్ఎఫ్ బృందాలు గురువారం విస్తృతంగా గాలింపు చర్యలు చేపట్టారు. గురువారం రాత్రి వరకు సాగిన గాలింపు చర్యల్లో మృతదేహం దొరకలేదు. శుక్రవారం ఉదయం శ్రీనివాసరావు మృత దేహాన్ని గాలింపు బృందాలు కనుగొని రేగుల గండి చెరువు ఒడ్డుకు తీసుకు వచ్చారు. మృతుడి భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

అంబారుపేటలో మూడిళ్లలో చోరీ

మధిరరూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీ పరిధిలోని అంబారుపేట గ్రామంలో గురువారం అర్ధరాత్రి తర్వాత దొంగలు హల్‌చల్ చేశారు. గ్రామంలో ఊరి చివర కాలనీలో కర్నాటి మణి, కర్నాటి కోటేష్, కర్నాటి శశి ఇళ్లలో చోరీ చేశారు. మణి, కోటేష్ కుటుంబసభ్యులు ఇళ్లకు తాళాలు వేసి హైదరాబాద్ వెళ్లారు. ముందుగా ఈ రెండిళ్ల తాళాలు పగుల గొట్టి లోపలకు ప్రవేశించి బీరువాలో ఉన్న వెండి వస్తువులను ఎత్తుకెళ్లారు. దుస్తులను చిందరవందరగా పడవేశారు. ఆ తర్వాత పక్కనే ఉన్న కర్నాటి శశి ఇంట్లోకి వెళ్లి దొంగలు స్కూటీని ఎత్తుకెళ్లారు. ఈ సంఘటనపై బాధితులు మధిర టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

మహిళ మెడలో గొలుసు చోరీకి యత్నం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై11 (ఆంధ్రజ్యోతి): మహిళ మెడలో బంగారు గొలుసును చోరీ చేసేందుకు యత్నించి, ఆమె వద్దఉన్న సెల్‌ఫోన్, పరుసును గుర్తు తెలియని వ్యక్తి లాక్కుపోయిన సంఘటన శుక్రవారంరాత్రి ఖమ్మం నగరంలో జరిగింది. బాధితురాలి బంధువులు తెలిపిన వివరాల ప్రకారం.. బుర్హాన్‌పురంలో నివాసముంటున్న గుడిపూడి. సుజాత అనే మహిళ మోప్మా విభాగంలో అధికారిగా విధులు నిర్వహిస్తున్నారు. శుక్రవారం సాయంత్రం ఇంటి సమీపంలో వాకింగ్ చేస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి ద్విచక్రవాహనంపై వచ్చి ఒక్కసారిగా సదరు మహిళ మెడపై కొట్టి బంగారు గొలుసును లాక్కొనేందుకు యత్నించాడు. దీంతో ఆమె బంగారు గొలుసును గట్టిగా పట్టుకోని వదలకపోవటంతో ఆమె వద్ద ఉన్న మెబైల్ ఫోన్, రూ.2వేల నగదు ఉన్న పరుసును లాక్కొని పారిపోయాడు. ఆమె కేకలు వేయటంతో చుట్టుపక్కల వారు వచ్చేలోపై ఆ వ్యక్తి అక్కడ నుంచి పారిపోయాడు. దీంతో సదరు మహిళ టూటౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు వెళ్లగా అక్కడ సిబ్బంది రేపు(శనివారం) రావాలని చెప్పినట్లు మహిళ బంధువులు తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలి మృతి

దుమ్ముగూడెం, జూలై11(ఆంధ్రజ్యోతి): కూల్‌డ్రింక్స్ వ్యాను రివర్స్ చేస్తున్న క్రమంలో వాహనం తగిలి నరసాపురానికి చెందిన కనుకు వెంకటమ్మ(70) మృతిచెందారు. భద్రాచలం డీలర్‌కు చెందిన ఒక కూల్‌డ్రింక్స్ వ్యాను నరసాపురం-సింగారం కూడలిలో ఉన్న ఒక కిరాణాదుకాణం వద్ద డ్రింక్స్ అన్‌లోడ్ చేసింది. వ్యాన్‌ను వెనక్కు తిప్పుతున్న క్రమంలో దుకాణం వద్ద సరుకులు కొనుక్కొని ఇంటికి వెళ్తున్న వెంకటమ్మను వ్యాను వెనుక భాగం ఢీకొట్టింది. దీంతో ఆమె సిమెంట్‌రోడ్డుపై పడడంతో తలకు తీవ్రగాయమైంది. భద్రాచలం ఏరియా ఆసుపత్రికి తరలించగా పరిస్థితి విషమించింది. న్యాయం చేయాలని మృతురాలి కుటుంబ సభ్యులు భద్రాచలం ఆసుపత్రి వద్ద ఆందోళన నిర్వహించారు. పోలీసులు సంఘటనా స్థలాన్ని పరిశీలించారు.

ఆశల తడి కోసం..

- సాగు నీటి కోసం సాగర్ ఆయకట్టు రైతుల ఎదురుచూపు
- ఎండిపోతున్న నారు మడులు, వరి పైర్లు
- కల్లూరు ప్రాంతంలో ముందస్తు నాట్లు


కల్లూరు మండలంలో సాగర్ ఆయకట్టు కింద సాగునీరు లేక ఎండి పోతున్న వరి పైరు

కల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నాగార్జున సాగర్ ఆయకట్టులో వానాకాలం సాగుపై ఆశలు చిగురిస్తున్నాయి. కృష్ణా నది ఎగువన నుంచి సాగర్‌కు వరద నీరు చేరుతుండటంతో సాగర్ ప్రాజెక్టులో నీటి నిల్వలు పెరుగుతున్నాయి. ఎడమ కాలువ కింద జిల్లాలో 2.50లక్షల ఎకరాలు సాగవుతుండగా.. జలవనరుల శాఖ కల్లూరు సర్కిల్ పరిధిలోనే 1.50 లక్షల ఆయకట్టు సాగవుతుంది. వానాకాలంలో వర్షాలు సమృద్ధిగా ఉంటాయని వాతావరణ శాఖ చెప్పటం.. నైరుతి కూడా ముందుగానే ప్రవేశించడంతో కల్లూరు, తల్లాడ, పెనుబల్లి, మధిర, పాలేరు ప్రాంతంలోని పలు గ్రామాల్లో రైతులు వరినార్లు పోయగా, మరి కొంతమంది వరి కరివేద సాగు చేపట్టారు. ముఖ్యగా కల్లూరు ప్రాంతంలోని చివరి ఆయకట్టులో చాలామంది రైతులు గంపెడాశలతో ముందస్తు నాట్లు కూడా వేశారు. నెల రోజులుగా వర్షాలు సమృద్ధిగా పడకపోవడంతో చెరువులు, కుంటల్లోకి వరద చేరలేదు. దాంతో పలు గ్రామాల్లోని వరి నారు మడులు, నాటు వేసిన లేత పొలాలకు సాగునీటి ఎద్దడి ఎదురై.. నెర్రెలు బారుతున్నాయి. కొన్ని చోట్ల ఎండి పోయేదశకు చేరుకున్నాయి. దీంతో వరి విత్తనాలు, దున్నడం, నాటు కూలీ ఖర్చుల కోసమని రూ.15వేల వరకు పెట్టుబుడులు పెట్టిన రైతులు దిగాలు చెందుతున్నారు. ప్రస్తుతం సాగర్‌కు ఎగువ నుంచి వరద వస్తున్న నేపథ్యంలో తక్షణమే సాగర్ నీరు విడుదల చేస్తే ఎండిపోతున్న నారు మడులకు ప్రాణం పోసినట్టవుతుందని రైతులు పేర్కొంటున్నారు. గతంలో అనేక సందర్భాల్లో సాగర్ ఎడమకాలువ పరిధిలోని ఖమ్మం జిల్లా ఆయకట్టుకు వర్షాభావ సమయంలో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు చొరవతో సాగర్ నీరు విడుదల చేసిన విషయం తెలిసిందే. అదే తరహాలో ఈ ఏడాది కూడా వ్యవసాయశాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావుతో పాటు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి చొరవ చూపి ఈ సమస్యను సీఎం రేవంత్‌రెడ్డికి దృష్టికి తీసుకెళ్లి సాగునీటిని విడుదల చేసేలా చూడాలని రైతులు కోరుతున్నారు.

తక్షణమే సాగర్ నీరందించి ఆదుకోవాలి

కట్టా అజయ్‌కుమార్, రైతు, మాజీ



సాగర్‌ప్రాజెక్టులో నీటి సామర్థ్యం పెరుగుతోంది. గతంలో వ్యవసాయ సీజన్‌కు అనుకూలంగా, రైతులను ఆదుకునేందుకు సాగర్ నీటిని ముందస్తుగా విడుదల చేసిన సందర్భాలున్నాయి. వాతావరణం అనుకూలిస్తుందన్న ఆశతో ఇప్పటికే కల్లూరు సర్కిల్ పరిధిలో 50శాతం మంది రైతులు అధిక మొత్తంలో పెట్టుబడులు పెట్టి ముందస్తుగా వరి వేశారు. చాలా గ్రామాల్లో రైతులు వరి నార్లు పోశారు. మరికొందరు కరివేద సాగు చేపట్టారు. కానీ వర్షాలు సక్రమంగా లేక, సాగర్ నుంచి ముందస్తుగా నీరు రాక నార్లు, కరివేద వరి ఎండిపోతోంది. వాటిని రక్షించేలా తక్షణమే ప్రభుత్వం సాగు నీరు అందించాలి.

వివాహిత ఆత్మహత్య

కామేపల్లి, జూలై 11(ఆంధ్రజ్యోతి): భర్త, అత్త, ఆడబిడ్డ వేధింపులు తట్టుకోలేక ఓ వివాహిత ఆత్మహత్య చేసుకుంది. సంఘటన కామేపల్లి మండల పరిధిలోని బాసిత్ నగర్ గ్రామంలో శుక్రవారం చోటు చేసుకుంది. బాసిత్‌నగర్ గ్రామానికి చెందిన తేజావత్ మౌనిక(24)ను ఏపీ రాష్ట్రం తిరువూరుకు చెందిన సఫావట్ క్రిష్ణప్రసాద్‌తో నాలుగేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి మూడేళ్ల బాబు ఉన్నాడు కొంతకాలంగా భర్త క్రిష్ణప్రసాద్, అత్త రాంకీ, ఆడబిడ్డ క్రిష్ణవేణి ముగ్గురు కలిసి మౌనికను వేధిస్తున్నారు. దీంతో ఆమె పది రోజుల క్రితం బాసిత్‌నగర్ తల్లిగారింటికి వచ్చింది.శుక్రవారం భర్త, అత్త, ఆడపుడుచు ఫోన్ చేసి దూషించటంతో మధ్యాహ్నా సమ యంలో ఇంట్లో ఊరివేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తండ్రి వీరన్న ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి

వేంసూరు,జూలై11 (ఆంధ్రజ్యోతి): విద్యుదాఘాతంతో రైతు మృతిచెందిన సంఘటన వేంసూరు మండలం చౌడారం గ్రామంలో శుక్రవారం చోటుచేసుకుంది. వేంసూరుకు చెందిన చల్లగుండ్ల నాగార్జున (55)చౌడారంలోని తన పొలంలో సర్వీస్ వైర్‌ను పక్కకు నెడుతుండగా విద్యుదాఘాతానికి గురయ్యాడు. అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు కేసునమోదు చేశారు.

పలు వైద్యశాలలకు కాయకల్ప అవార్డు

ఇల్లెందు ఏరియా వైద్యశాల, చర్ల, పెనుబల్లి సీహెచ్‌సీలకు గుర్తింపు

ఇల్లెందుటౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఇల్లెందు ఏరియా ప్రభుత్వవైద్యశాలకుకాయకల్ప అవార్డు లభించింది. ఉన్నత ప్రమాణాలు, సేవలు, తగినంత సిబ్బంది, నూతన ఆసుపత్రి భవనం ఉన్న వారికే ఈ అవార్డు వస్తుంది. ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య, జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ సహకారంతో ఆసుపత్రి చరిత్రలోనే మొదటి సారి అవార్డు రావడం అభినందనీయమని వైద్యులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు. ఏరియా వైద్యశాలకు కమేడేషన్ పద్దతిలో లక్ష రూపాయల నగదు బహుమతి లభించింది.

పెనుబల్లి: పెనుబల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్(సీహెచ్‌సీ) ప్రశంసా అవార్డును దక్కించుకున్నట్లు వైద్యాధికారి కిరణ్‌కుమార్ తెలిపారు. ఈ ఏడాది మేలో ఆసుపత్రిలో వివిధ విభాగాల్లో రోగులకు మెరుగైన వసతులు కల్పించటం, పరిశుభ్రతపై ప్రధానంగా దృష్టి కేంద్రీకరించడంలో రాష్ట్రస్థాయి అధికారులు నిర్వహించిన సర్వేలో పెనుబల్లి సీహెచ్‌సీకి ప్రశంసా అవార్డు దక్కింది. ఆసుపత్రి మెడికల్ ఆఫీసర్ ఎన్.కిరణ్‌కుమార్, ఆర్ఎంవో వీఆర్‌వీ. స్రవంతి, డాక్టర్లు, నర్సింగ్ సూపరింటెండెంట్ వై.రాజేశ్వరి, సిబ్బందిని డీసీహెచ్ఎస్ రాజశేఖర్, సత్తుపల్లి ఎమ్మెల్యే మట్టా రాగమయి అభినందించారు.

చర్ల, జూలై 11(ఆంధ్రజ్యోతి): చర్ల సీహెచ్‌సీ కాయకల్ప అవార్డుకు ఎంపికైనట్లు సీహెచ్‌సీ సూపరింటెండెంట్ సాయివర్ధన్ శుక్రవారం తెలిపారు. వైద్యశాల కొత్తదైనా అవార్డు రావడం చాలాసంతోషంగా ఉందన్నారు. అవార్డు వచ్చేందుకు డీసీహెచ్ రవిబాబు, భద్రాచలం ఏరియా వైద్యశాల సూపరిండెంట్ డాక్టర్ రామకృష్ణ ఎంతో సహకారం అందించారని కొనియాడారు. అలాగే చర్ల స్టాఫ్‌నర్స్ రాజ్యలక్ష్మి ఎసెస్‌మెంట్ ఏర్పాట్లు చూశారని తెలిపారు.



ఇల్లెందులో హర్షం వెలిబుచ్చుతున్న వైద్యశాల వైద్యులు, సిబ్బంది, పెనుబల్లి ఆసుపత్రిలో

బుల్లెట్ బండిపై.. మావోయిస్టుల అడ్డాలోకి..

- చర్ల మండలం పూసుగుప్పలో భద్రాద్రి కలెక్టర్, ఎస్పీ పర్యటన
- మొబైల్ వైద్యశాల, అంబులెన్స్ ప్రారంభం
- హాజరైన ఎమ్మెల్యే వెంకట్రావు


సంచార వైద్యశాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే, కలెక్టర్, ఎస్పీ

చర్ల, జూలై11(ఆంధ్రజ్యోతి): నక్సల్ ప్రభావిత ప్రాంతమైన చర్ల మండలంలోని పూసుగుప్పగ్రామంలో కలెక్టర్ జితేష్ విపాటిల్, ఎస్పీ రోహిత్‌రాజ్, భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు శుక్రవారం పర్యటించారు. ఈ సందర్భంగా వారు గ్రామంలో రూ.కోటి వ్యయంతో ఏర్పాటు చేసిన మొబైల్ వైద్యశాల, అంబులెన్స్‌ను ప్రారంభించారు. ఏజెన్సీ పేదలకు మెరుగైన వైద్యం అందించాలనే లక్ష్యంతో రూ.కోటితో ఈ సంచార వైద్యశాల, అంబులెన్స్ వైద్యపరికరాలు సమకూర్చామన్నారు. ఈ వైద్యశాల్లో నిత్యం రోగులకు వైద్యులు అందుబాటులో ఉంటారని, తెలంగాణతో పాటు సరిహద్దునున్న ఛత్తీస్‌గఢ్ ఆదివాసీలకు వైద్యసేవలు అందుతాయని, అంబులెన్స్ కూడా గ్రామాల్లో సేవలందిస్తుందన్నారు. వర్షాల నేపథ్యంలో వచ్చే వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని, అనారోగ్యం వస్తే వెంటనే వైద్యశాలకు రావాలని సూచించారు. అలాగే పూసుగుప్ప అడవులు ఎంతో అందంగా ఉన్నాయని, ఎకో టూరిజానికి అనువైన ప్రాంతమని పేర్కొన్నారు. అనంతరం భద్రాచలం ఎమ్మెల్యే తెల్లం వెంకట్రావు మాట్లాడుతూ, గతంలో పూసుగప్పకు వచ్చేందుకు రోడ్డు కూడా లేదని, ఇప్పుడు డబుల్ రోడ్డు నిర్మించడం, వైద్యశాల ఏర్పాటు చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్, చర్ల సీఐ రాజువర్మ, స్పెషల్ బ్రాంచ్ ఇన్స్పెక్టర్లు చెన్నూరి శ్రీనివాస్, ఈ.శ్రీనివాస్, చర్ల ఎస్సైలు నర్సిరెడ్డి, కేశవ, ఎంపీడీవో ఈదయ్య, తహిసీల్దార్ శ్రీనివాసులు, వైద్యులు శ్రీధర్ పాల్గొన్నారు.

రేపు యోగా సంఘం రాష్ట్ర మహాసభలు

ఖమ్మంస్పోర్ట్స్, జూలై 11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యోగా సంఘం ద్వితీయ రాష్ట్ర మహాసభను ఆదివారం నగరంలోని కవిత మెమోరియల్ డిగ్రీ కళాశాలలో నిర్వహించనున్నట్లు ఆ సంఘ రాష్ట్ర వ్యవస్థాపక అధ్యక్షుడు మరికంటి వెంకట్ తెలిపారు. శుక్రవారం నగరంలో నిర్వహించిన యోగా సాధకుల సమావేశంలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. మహాసభకు రాష్ట్రవ్యాప్తంగా 200మంది యోగా ప్రతినిధులు హాజరవుతారని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ట్‌ఆఫ్ లివింగ్ టీచర్ బి.వెంకట్, శిక్షకుడు పంజాల ఐలయ్య, దామోదర్, కల్పన, జ్యోతి సృజన తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న స్కైలాబ్ బాబు

ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను బీజేపీ అమలు చేస్తోంది

- కేవీపీఎస్ రాష్ట్ర కార్యదర్శి స్కైలాబ్‌బాబు
- ఉమ్మడి జిల్లా స్థాయి శిక్షణ తరగతులకు హాజరు

ఖమ్మంసంక్షేమ విభాగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): రాజ్యాంగంలో సెక్యూలరిజం, సోషలిజం అనే విధానాలు లేకుండా ఆర్ఎస్ఎస్ సిద్ధాంతాలను బీజేపీ అమలు చేస్తోందని, మనువాద విధానాలతో సామాజిక న్యాయానికి సమాధి జరుగుతుందని కులవివక్ష పోరాట సమితి(కేవీపీఎస్) రాష్ట్ర కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు ఆరోపించారు. శుక్రవారం ఖమ్మంలో కేవీపీఎస్ ఉమ్మడి జిల్లా రెండు రోజుల శిక్షణ తరగతులను ఆయన ప్రారంభించారు. కుల సమస్య పరిష్కార మార్గాలు అనే అంశంపై మాట్లాడారు. బీజేపీ పరిపాలిత రాష్ట్రాల్లో దళితులపై తీవ్రమైన దాడులు జరుగుతున్నాయని వాటిని ప్రశ్నించేందుకు కూడా అవకాశం ఇవ్వటం లేదని ఆరోపించారు. ప్రపంచ దేశాల్లోనే ఆదర్శవంతమైన భారత రాజ్యాంగంలో సెక్యూలరిజం, సోషలిజం తొలగించాలనే నినాదాలను మతోన్మాదం జత చేస్తూ ఆర్ఎస్ఎస్ ముందుకు తెస్తోందన్నారు. నాయకులు నందిపాటి మనోహర్, మాచర్ల భారతి, బండి రమేశ్, పాపిట్ల సత్యనారాయణ, శ్రీను, కరకుంట నరేశ్, గోపాల్, సైదులు, పుల్లయ్య, సర్వేశ్వరరావు, నందిపాటి రమేశ్, మోహన్‌రావు పాల్గొన్నారు.

జోడో యాత్ర స్ఫూర్తితో బీసీలకు 42శాతం రిజర్వేషన్

కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జ్ వంశీచంద్‌రెడ్డి

ఖమ్మం సంక్షేమవిభాగం, జూలై11 (ఆంధ్రజ్యోతి): ఏఐసీసీ మాజీ అధ్యక్షుడు రాహుల్‌గాంధీ జోడో యాత్ర నిర్వహించి ప్రజల మనోభావాలను తెలుసుకున్నారని అందుకే రాష్ట్రంలో మోడల్‌గా బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తున్నామని కాంగ్రెస్ జిల్లా ఇన్‌చార్జీ, ఏఐసీసీ కార్యదర్శి చల్లా వంశీచంద్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం డీసీసీ కార్యాలయంలో ఓబీసీసెల్ ఆధ్వర్యంలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్ అమలుపై ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించారు. డీసీసీ అధ్యక్షుడు కేక్ కత్తిరించి వంశీచంద్‌రెడ్డికి తినిపించారు. అనంతరం రాహుల్‌గాంధీ, రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీలకు క్షీరాభిషేకం చేశారు. బీసీలకు జనాభా ప్రాతిపదికన గుర్తింపు దక్కిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి బీసీలు అండగా నిలవాలని పిలుపునిచ్చారు. బడుగు బలహీన వర్గాల ప్రజల కోసం కాంగ్రెస్ పార్టీ కట్టుబడి పనిచేసిందన్నారు. నగర కాంగ్రెస్ అధ్యక్షుడు ఎండీ జావీద్, మాజీ ఎమ్మెల్సీలు బాలసాని లక్ష్మీనారాయణ, పోట్ల నాగేశ్వరరావు, కాంగ్రెస్ జిల్లా అనుబంధ సంఘాల అధ్యక్షులు దొబ్బల సౌజన్య, బొడ్డు బొందయ్య, మెక్కా శేఖర్‌గౌడ్, హుస్సేన్, కార్పొరేటర్ రాపర్తి శరత్‌కుమార్ పలువురు నాయకులు పాల్గొన్నారు.



వంశీచంద్‌రెడ్డికి కేక్ తినిపిస్తున్న పువ్వాళ్ల

మాస్టర్ ప్లాన్ ముచ్చటేదీ?

- 2041 లక్ష్యంతో సుడా, కేఎంసీ సంయుక్త మాస్టర్ ప్లాన్
- మంత్రి తుమ్మల ఆదేశాలతో రెండు నెలల క్రితమే కదలిక
- బెంగళూర్ ప్రింట్‌కు మాస్టర్ ప్లాన్
- నేటికీ పురోగతి లేని వైనం



ఖమ్మం సంక్షేమ విభాగం, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పెరుగుతున్న జనాభా, నగరాలకు అనుగుణంగా భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రతీ నగరానికి మాస్టర్ ప్లాన్ రూపొందిస్తారు. ఖమ్మం నగరానికి 2011లో మాస్టర్ ప్లాన్ ఆమోదించారు. తర్వాత అనేక పర్యాయాలు మాస్టర్ ప్లాన్‌పై చర్చలు, సమీక్షలు జరిపినా ఖమ్మం నగర పాలక సంస్థ మాస్టర్ ప్లాన్‌కు మోక్షం కలగలేదు. వ్యవసాయశాఖ మంత్రిగా తుమ్మల నాగేశ్వరరావు బాధ్యతలు చేపట్టాకా ఖమ్మం విద్యావైద్యం, వ్యాపార, పరిశ్రామికాభి వృద్ధి దూరదృష్టితో 2041 ఖమ్మం నగరం విస్తరణపై మాస్టర్ ప్లాన్‌కు రూపకల్పన జరిగింది. కొన్ని కారణాల వల్ల ఇటీవల ఆమోదం పొందలేక పోయింది. కాగా మే13న ఖమ్మంలో కాంగ్రెస్ కార్పొరేటర్లతో మంత్రి తుమ్మల నాగేశ్వరరావు నిర్వహించిన సమావేశంలో ఖమ్మం మాస్టర్ ప్లాన్ చర్చకు వచ్చింది. మాస్టార్ ప్లాన్‌కు మోక్షం కలగబోతుందని అందరూ ఆశించారు. మరుసటి రోజే మేయర్ పునుకొల్లు నీరజ ఆధ్వర్యంలో కమిషనర్ అభిషేక్ అగస్త్య కార్పొరేటర్లతో సమావేశమయ్యారు. పలు మార్పులు, చేర్పులను కమిషనర్‌కు కార్పొరేటర్లు సూచించారు. తర్వాత వెంటనే మాస్టర్ ప్లాన్‌కు మోక్షం కలుగుతుందని అందరూ భావించారు. కానీ రెండు నెలలైనా మాస్టర్ ప్లాన్‌పై కదలిక రాలేదు. మాస్టర్ ప్లాన్ నమూనాలను ప్రింట్‌లు తీయించేందుకు బెంగళూర్‌కు పంపినట్లు తెలుస్తోంది. మాస్టర్ ప్లాన్ ఆమోదం కాకపోవటంతో ఖమ్మం నగరంలోని రియల్ ఎస్టేట్ రంగంపై ప్రభావం పడుతుంది. ఇళ్ల స్థలాలు కొనుగోలు చేసే వారు కూడా రెండు నెలలుగా మాస్టర్ ప్లాన్ కోసం ఎదురు చూస్తూ కొనుగోళ్లను వాయిదాలు వేస్తున్నారు. మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జోక్యం చేసుకొంటే మాస్టర్ ప్లాన్ ముందుకు సాగే అవకాశం కనిపించటం లేదని పలువురు కార్పొరేటర్లు చెబుతున్నారు.

స్టాకు ఉన్నా పొటాష్ విక్రయించడం లేదు

- సత్తుపల్లి ఏవోకు రైతుల ఫిర్యాదు
- డీలర్ల గోడౌన్ల తనిఖీ, రిజిస్టర్లను పరిశీలన



స్టాకు రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

సత్తుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి పట్టణంలో కొందరు ఎరువుల డీలర్లు పొటాష్, యూరియా స్టాకు ఉన్నా విక్రయించటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లి పట్టణం, మండలానికి చెందిన కొందరు రైతులు యూరియా కోసం వస్తే స్టాకు లేదని సమాధానం చెబుతున్నారని, పోటాష్ గోదాముల్లో నిల్వ ఉన్నా డీలర్లు లేదని చెబుతూ రైతులను వెనక్కి పంపుతున్నారని ఆరోపించారు. శుక్రవారం పోటీష్ కొనుగోలు చేసేందుకు కొందరు రైతులు డీలర్ల వద్దకు రాగా లేదని చెప్పారని రైతు సంఘం నాయకుడు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి ఆరోపించారు. తాను స్వయంగా 18 బస్తాల పోటీష్ కావాలని ఒక డీలర్ వద్దకు వెళ్లగా స్టాకు లేదన్నారని, వేరే షాపునకు వెళ్లగా అక్కడ 15 బస్తాలు మాత్రమే ఇస్తామని చెప్పారని అన్నారు. దీనిపై ఆయన ఏవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏవో పట్టణంలోని డీలర్ల గోడౌన్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గోదాములో 150 బస్తాలు, మరో డీలర్‌కు చెందిన గోదాములో 45 బస్తాలు స్టాకు ఉన్నట్లు ఏవో గుర్తించారు. స్టాకు లేదని చెప్పిన ఒక డీలర్‌పై ఏవో శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పొటాష్ ధరను రూ.1850లకు కేంద్ర ప్రభుత్వం పెంచున్నట్లు ప్రకటించిందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం రూ.1535లు ఉన్న పొటాష్‌ను విక్రయించటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాలపుల్లయ్య పాల్గొన్నారు.

నేలకొండపల్లిలో నేడు విద్యుత్ కోత

నేలకొండపల్లి,జూలై11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని కొత్తకొత్తూరులోని విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ కుక్కల రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.సబ్‌స్టేషన్ మరమ్మతులు, తీగలకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలను నరకటం లాంటి పనులను నిర్వహించాల్సి ఉన్నందున విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఏఈ చెప్పారు. నేలకొండపల్లి, కొత్తకొత్తూరు, తిరుమలాపురం, పాతకొత్తూరు,పైనంపల్లి, బోదులబండ, రామచంద్రాపురం, అనంతనగర్, కోరట్లగూడెం గ్రామాల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 1గంట వరకు విద్యుత్ సరఫరా ఉండదని ఏఈ చెప్పారు.

దివ్యాంగుల రుణాలకు దరఖాస్తుల ఆహ్వానం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై11 (ఆంధ్రజ్యోతి): దివ్యాంగుకు ఉపాధి పునరావాసం పథకం కింద 2025-26కిగాను రుణాలు మంజూరు కొరకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా మహిళా శిశు వయోవృద్ధుల వికలాంగుల సంక్షేమశాఖ అధికారి కె.రాంగోపాల్‌రెడ్డి శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. రూ.50వేల యూనిట్లు 25, లక్షయూనిట్ 1, రెండు లక్షలయూనిట్1, మూడు లక్షల యూనిట్ 1, మొత్తం 28యూనిట్లు జిల్లాకు మంజూరైనట్లు తెలిపారు. ఈనెల 14 నుంచి 31లోగా దరఖాస్తులు ఆన్‌లైన్‌లో చేసుకోవాలని తెలిపారు.

జిల్లా ప్రధాన న్యాయమూర్తికి అభినందనలు

ఖమ్మంలీగల్,జూలై11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రన్యాయాధికారుల సంఘం అధ్యక్షుడిగా ఎన్నికైన జిల్లా ప్రధాన న్యాయమూర్తి జి.రాజగోపాల్‌ను ఖమ్మం పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఏ.శంకర్ మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అభినందనలు తెలిపారు. ఖమ్మం బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావుతో పాటు కార్యవర్గసభ్యులు జిల్లా ప్రధాన న్యాయమూర్తికిఅభినందనలు తెలిపారు. ఒకటో అదనపు పబ్లిక్ ప్రాసిక్యూటర్ జె.శరత్ కుమార్ రెడ్డి తోపాటు పలువురు న్యాయవాదులు అభినందనలు తెలియజేశారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని, జూలై11(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం కొండవనమాల గ్రామానికి చెందిన హరికొట్ల శ్రీను(24) అను యువకుడు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నీషియన్‌గా పనిచేస్తున్న శ్రీనుఓయువతిని ప్రేమిస్తున్నాడు. ప్రేమించిన యు వతి కొద్ది రోజుల నుంచి మాట్లాడకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందాడు. దీంతో ఈనెల 3న అర్ధరాత్రి మండలంలోని కొదుమూరు గ్రామ సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయం వద్ద పురుగుల మందు తాగాడు. విషయాన్ని తాను పనిచేస్తున్న ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా వెంటనే వారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫి ర్యాదు మేరకు ఎస్ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేశారు.

ట్రాక్టర్‌లో డీజిల్ చోరీ

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామ సమీపం లో ఉన్న నాగపూర్- అమరావతి జాతీయ రహదారి కార్యాలయం వద్ద ఉన్న ట్రాక్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు 15 లీటర్ల డీజిల్‌ను చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సూపర్‌వైజర్ కోట రవి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ కేసు నమోదు చేశారు.

బాల కార్మికుల గుర్తింపు

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న బాలకార్మికుడిని, తిమ్మినేనిపాలెంలో ఇసుక ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్న మరో బాలకార్మికుడిని ఆపరేషన్ ముస్కాన్ బృంద సభ్యులు గుర్తించారు. మధిర అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొర్ని చందర్‌రావు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు.

పగిడేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన

కొణిజర్ల, జూలై11(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కాక ప్రజలు రోడెక్కారు. వర్షాకాలం వస్తే చాలు వర్షాలకు రాకపోకలు నిలిచిపోవలసిందే. ఏ అధికారికి చెప్పిన, ఏ నేతకు చెప్పిన సమస్య పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో పగిడేరు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ వర్షాకాలం వస్తే పల్లిపాడు నుంచి అంజనాపురం ఏన్కూర్ వరకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే రాకపోకలు నిలిచిపోతున్నప్పటికి సమస్య అధికారులకు, నేతలకు పట్టడంలేదని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులు అర్థం చేసుకొని లాలాపురం-తీగలబంజర మధ్య రహదారి పగిడేరు పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాంచాలని డిమాండ్ చేశారు. తమసమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు సంక్రాంతి నర్సయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, కట్టా రాంబాబు, బానోతు భరత్, మహబూబ్‌అలీ, బాణాల శ్రీనివాసరావు, చల్లా వెంకటనారాయణ, అనుమోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సూపరింటెండెంట్



కలెక్టర్‌ను కలిసిన నరేందర్

ఖమ్మం కలెక్టరేట్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): ఖమ్మంప్రభుత్వ జనరల్ ఆసుపత్రి(జీజీహెచ్) సూపరింటెండెంట్‌గా డాక్టర్.ఎం.నరేందర్ శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. రాష్ట్రవ్యాప్తంగా డైరెక్టర్ మెడికల్ ఎడ్యుకేషన్(డీఎంఈ) బదిలీల్లో భాగంగా వికారాబాద్ మెడికల్ కాలేజీలో పల్మోనాలజిస్ట్ విభాగంలో ప్రొఫెసర్‌గా పనిచేస్తున్న నరేందర్‌ను పదోన్నతిపై ఖమ్మం ప్రభుత్వ ప్రధాన ఆస్పత్రి సూపరింటెండెంట్‌గా నియమించారు. ఈ మేరకు పూర్వపు సూపరింటెండెంట్ డాక్టర్ కిరణ్ కుమార్ నుంచి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా నూతన సూపరింటెండెంట్ డాక్టర్ నరేందర్‌ను ఆస్పత్రి వైద్యులు బి కిరణ్‌కుమార్, ఆర్ఎంవోలు బి రాంబాబు, ఎస్ రాంప్రసాద్, పూర్వపు ప్రిన్సిపాల్ రాజేశ్వరరావు, వివిధ విభాగాల హెచ్‌వోడీలు, ప్రొఫెసర్లు డాక్టర్ యామిని, డాక్టర్ సమత, డాక్టర్ సౌజన్య, నందగిరి శ్రీను పుష్పగుచ్ఛాలిచ్చి అభినందించారు. అనంతరం నరేందర్ జిల్లా కలెక్టర్ అనుదీప్ దురిశెట్టి ని మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందించారు.

'శ్రీకృష్ణ ప్రసాద్' విద్యార్థులకు వైద్యపరీక్షలు



వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై11(ఆంధ్రజ్యోతి): విద్యార్థులు ఆరోగ్యంవంతంగా ఉంటేనే ఉన్నత చదువులలో రాణించడానికి సాధ్యమవుతుందని పాఠశాల కృష్ణప్రసాద్ పాఠశాల చైర్‌పర్సన్ నిష్ఠాశర్మ అన్నారు. పాఠశాలలో శుక్రవారం మెడికల్ క్యాంప్ ఏర్పాటు చేశారు. కంటి, దంత, గుండెకు సంబంధమైన వైద్య పరీక్షలు నిర్వహించారు. కొందరి విద్యార్థులలో దృష్టిలోపం, కంటి సమస్యలు ఉన్నట్లు గుర్తించారు. మరోసారి వైద్య పరీక్షలు నిర్వహిస్తామని వైద్యులు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఏఆర్ ఏసీపీ సుశీల్ సింగ్, నర్సయ్య, ఆర్ఐ కామరాజు, ప్రిన్సిపాల్ శ్రీనివాసరాజు, వైద్యులు పాల్గొన్నారు.

జనాభా నియంత్రణకు కృషి చేయాలి

డీఎంహెచ్‌వో కళావతిబాయి



ప్రశంసాపత్రాలను అందిస్తున్న డీఎంహెచ్‌వో

ఖమ్మంకలెక్టరేట్,జూలై11(ఆంధ్రజ్యోతి): జనాభా నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషిచేయాలని జిల్లా వైద్యఆరోగ్యశాఖ అధికారి బి కళావతీబాయి కోరారు. ఐడీఓసీ ప్రాంగణంలోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో శుక్రవారం 'ప్రపంచ జనాభా దినోత్సవం' కార్యక్రమాన్ని నిర్వహించారు. జనాభా పెరుగుదల వల్ల కలిగే పరిణామాలను చర్చించడానికి, అవగాహన కల్పించడంతో పాటు సామూహిక చర్యలు తీసుకోవడంలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బంది ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు.ఈ ఏడాది యునైటెడ్ నేషన్స్ డెవలప్మెంట్ ప్రోగ్రాం(యూఎన్‌డీ పీ) లో భాగంగా 'శరీరం, మనస్సు సిద్ధంగా ఉన్నప్పుడే తల్లికావడానికి సరైన సమయం'అనే నినాదాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. ఆడపిల్లలు సరైన వయసుకు వచ్చాక, జీవితంలో స్థిరపడ్డాక పెళ్లి చేసుకోవాలని, పెళ్లి తర్వాత భార్య భర్తలిద్దరు మంచి అవగాహనతో ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రోగ్రాం అధికారులు, డాక్టర్ వెంకటరమణ, డాక్టర్. చందునాయక్, డాక్టర్ రామారావు, డాక్టర్. బిందుశ్రీ, డెమో సుబ్రహ్మణ్యం, స్టాటస్టికల్ ఆఫీసర్ నవీన్ కుమార్, డిప్యూటీ డెమో సాంబశివారెడ్డి పాల్గొన్నారు. అనంతరం జిల్లాలో ప్రభుత్వ ప్రసవాలు ఎక్కువగా ప్రోత్సహించిన పీహెచ్‌సీ సుబ్లేడు హెల్త్ సూపర్వైజర్లు బి. మాధవి, ఎం.హైమావతి, ఉత్తమ సర్జన్ అలివేలు, ఉత్తమ నర్సింగ్ అధికారి,ఎస్.లక్ష్మి, పీపీ యూనిట్, డీడీఎం కృష్ణ మోహన్, డీఈవో రాజేష్, ఉత్తమ ఆశ బి.ఆదిలక్ష్మి తదితరులకు ప్రశంసా పత్రాలను అందచేశారు.

నేడు సీపీఐ మండల మహాసభ

తిరుమలాయపాలెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ మండల మహాసభ శనివారం జరుగుతుందని పార్టీ మండల కార్యదర్శి బత్తుల రాధాకృష్ణ తెలిపారు. ఈ మహాసభకు సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు, బాగం హేమంతరావు, పాల్గొంటారన్నారు.

తిరుమలాయపాలెం ప్రభుత్వ ఆసుపత్రికి కాయకల్ప అవార్డు

తిరుమలాయపాలెం, జూలై11 (ఆంధ్రజ్యోతి): తిరుమలాయపాలెంలోని ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రానికి జాతీయ ఆరోగ్యమిషన్ ఆధ్వర్యంలో ఇచ్చే కాయకల్ప అవార్డుకు ఎంపికయింది. తిరుమలాయాలెంలోని వైద్యవిధానపరిషత్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఉత్తమ వైద్యసేవలందించడంతో పాటు పరిసరాల పరిశుభ్రత, ఉత్తమ ప్రమాణాలు పాటించినదుకుగాను అవార్డు అందిస్తుంది.

ఘనంగా బండి జన్మదిన వేడుకలు

ఖమ్మంమార్కెట్, జూలై11(ఆంధ్రజ్యోతి): జిల్లా బీజేపీ ఆధ్వర్యంలో నగరంలో శుక్రవారం కేంద్ర మంత్రి బండి సంజయ్‌కుమార్ జన్మదిన వేడుకలను ఘనంగా నిర్వహించారు. పలువురు కార్యకర్తలు రక్తదానం చేశారు. ఆసుపత్రుల్లో గర్భిణులకు పౌష్టికాహారం పంపిణీతో పాటు కాల్వొడ్డు ప్రాంతంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షుడు నెల్లూరి కోటేశ్వరరావు, రాష్ట్ర నాయకుడు సన్నె ఉదయ్‌ప్రతాప్, ఈవీ రమేష్, డాక్టర్ గోంగూర వెంకటేశ్వర్లు ఉన్నారు.

నిత్యావసరాలు అందజేత

ఖమ్మంరూరల్:బండి సంజయ్ జన్మదినం సందర్భంగా బీజేపి జిల్లా కార్యదర్శి నకిరికంటి వీరభద్రం ఆధ్వర్యంలో ఏదులాపురం మునిసిపాలిటీ పరిధిలోని పెద్దతండాలోని మెపీమానసిక వికలాంగుల కేంద్రంలో నిత్యవసర సరుకులను శుక్రవారం అందజేశారు. పండ్లు, స్వీట్లు పంచిపెట్టారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మధు, జిల్లా నాకులు కన్నేటి కోటయ్య, శ్రీనివాస్, సాగర్, సురేష్, నవీన్, సురేష్ పాల్గొన్నారు.

ఏడీఏ సరితకు ఉద్యోగోన్నతి

నేలకొండపల్లి,జూలై11(ఆంధ్రజ్యోతి):కూసుమంచి వ్యవసాయ సహాయ సంచాలకుడు(ఏడీఏ) బి.సరితకు ఉద్యోగోన్నతి లభించింది. కూసుమంచి ఏడీఏగా పని చేస్తున్న సరితకు డిప్యూటీ డైరెక్టర్ ఆఫ్ అగ్రికల్చర్‌గా పదోన్నతి లభించింది. సరితను పదోన్నతిపై భద్రాద్రి కొత్తగూడెంజిల్లా ఆత్మడీపీడీగా నియమించారు. సరితను పలువురు వ్యవసాయాధికారులు అభినందించారు.

పారా అథ్లెట్‌కు అభినందన



శ్రీనును అభినందిస్తున్న కాలనీ వాసులు

ఖమ్మం స్పోర్ట్స్, జూన్ 11(ఆంధ్రజ్యోతి): ఇటీవల తిరుపతిలో జరిగిన సౌత్ ఇండియా నేషనల్ పారా అథ్లెటిక్స్ పోటీల్లో షాట్‌పుట్ విభాగంలో రజత పతకం సాధించిన నగరానికి చెందిన బత్తుల శ్రీనును బుర్హాన్‌పురం కనకదుర్గ కాలనీ వాసులు అభినందించారు. శాలువాతో సత్కరించారు. త్వరలో జరిగే అంతర్జాతీయ పోటీలలో సైతం రాణించి జిల్లాకు ఖ్యాతిని తీసుకురావాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో వీరబాబు, గాంధీ, క్రిష్ణమూర్తి, కోటి, నరసయ్య వెంకన్న, ఎల్లయ్య, రవి ఉన్నారు.

రేపు టీయూడబ్ల్యూజే(ఐజేయూ) సమావేశం

ఖమ్మంచర్చికాంపౌండ్, జూలై11(ఆంధ్రజ్యోతి): తెలంగాణ యూనియన్ ఆఫ్‌వర్కింగ్ జర్నలిస్టు (టీయూడబ్ల్యూజేఐజేయూ)యూనియన్ నగర మహాసభ ఆదివారం ఉదయం జడ్పీ సమావేశ మందిరంలో జరుగనున్నది. ఈమేరకు నగర అధ్యక్ష కార్యదర్శులు షైసా పాపారావు, చెరుకుపల్లి శ్రీనివాస్ శుక్రవారం ఒక ప్రకటన విడుదల చేశారు.

విద్యార్థినికి ఆర్థిక చేయూత

ఖమ్మంఖానాపురంహవేలి, జూలై11(ఆంధ్రజ్యోతి): పేద విద్యార్థిని విద్యకు ఖమ్మం లయన్స్ క్లబ్ యునిట్ ఆర్థిక సహాయం అందించింది. వైరా మండలం పుణ్యపురం గ్రామానికి చెందిన చెరుకూరి.లలిత, సాంబమూర్తి దంపతులు కుమార్తె నవేదిత ఇంజనీరింగ్ విద్యకు రూ.15 వేలను క్లబ్ అధ్యక్షుడు డాక్టర్ కే. జగదీష్‌బాబు శుక్రవారం ఖమ్మంలో అందజేశారు.

పునరావాస కేంద్రాల తనిఖీ

ఖమ్మంరూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): గత ఏడాది వచ్చిన వరదలను దృష్టిలో ఉంచుకుని ముందస్తు ప్రణాళిక కింద ఏదులాపురం మునిపాలిటీ పరిధిలోని పునరావాస కేంద్రాలను తహసీల్దార్ పిల్లి. రాంప్రసాద్, మునిసిపల్ కమిషనర్ శ్రీనివాస్ రెడ్డి శుక్రవారం తనిఖీ చేశారు. మునిసిపాలిటిలోని టీసీవి రెడ్డి ఫంక్షన్‌హాల్, రామ్‌లీల ఫంక్షన్‌హాల్, చిన్న వెంకటగిరిలోని జెడ్పీఎస్ఎస్ పాఠశాల, జీవీఆర్ ఫంక్షన్‌హాల్ తదితర వాటిని తనిఖీ చేశారు. మౌలిక వసతుల గురించి తెలుసుకున్నారు.

సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

కామేపల్లి,జూలై11(ఆంధ్రజ్యోతి): సీఎంరేవంత్‌రెడ్డి చిత ప్రటానికి కాంగ్రెస్ పార్టీ బీసీ మండల అధ్యక్షుడు చల్లా మల్లయ్య ఆధ్వర్యంలో క్షీరాభిషేకం చేశారు. స్థానిక ఎన్నికల్లో బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాలని నిర్ణయం తీసుకోవాలని భావిస్తుండటంతో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో డీఎస్, బొడ్డు లక్ష్మీనారాయణ రామక్రిష్ణ, బండి నర్సింహరావు, కమటం వెంకటేశ్వర్లు, విశ్వనాథం పాల్గొన్నారు.

జనాభా నియంత్రణను పాటించండి

పీహెచ్‌సీ వైద్యాధికారి శ్రావణ్‌కుమార్

నేలకొండపల్లి,జూలై11(ఆంధ్రజ్యోతి):జనాభా నియంత్రణను పాటించటం ద్వారా జనాభాను తగ్గించవచ్చని నేలకొండపల్లి ప్రాథమిక వైద్యశాల వైద్యాధికారి శ్రావణ్ కుమార్ పిలుపునిచ్చారు.ప్రపంచ జనాభా దినోత్సవం పురస్కరించుకుని శుక్రవారం ప్రాథమిక వైద్యశాల సిబ్బంది ఆధ్వర్యంలో ర్యాలీని నిర్వహించారు. పీఎస్సార్ సెంటర్లో ర్యాలీని ఉద్దేశించి డాక్టర్ శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ జనాభా పెరుగుదల వలన ఎన్నో ఇబ్బందులు తలెత్తుతాయన్నారు. కార్యక్రమంలో సీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ మంగళ, డాక్టర్ నాగమణి, డాక్టర్ సనా, సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.





అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు

» ఎమ్మెల్యే రాందాస్‌నాయక్



ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికి ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తామని వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ తెలిపారు. మండలంలోని ముసలిమడుగుకు చెందిన లబ్ధిదారులకు మొదటివిడత ఇందిరమ్మ ఇళ్ల మంజూరు పత్రాలను శుక్రవారం ఎమ్మెల్యే రాందాస్‌నాయక్ స్నానాల లక్ష్మీపురంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత పదేళ్ల బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో పేదలకు పక్కాగృహాలు నిర్మించకుండా పూర్తిగా విస్మరించిందని విమర్శించారు. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదలకు ఇందిరమ్మ ఇళ్లు నిర్మిస్తుందని, అభివృద్ధి, సంక్షేమ పథకాలు కొనసాగిస్తుందని తెలిపారు. పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, మం డల, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, ఏదునూరి సీతరాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, నర్వనేని గోపాలరావు, నర్వనేని అశోక్, తడికమళ్ల నాగేశ్వరరావు తదితరులున్నారు.

వెనుకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

» జడ్పీ సీఈవో దీక్షా రైన



మధ్యాహ్న భోజనం చేస్తున్న జడ్పీ సీఈవో దీక్షా రైన

బోనకల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): పదవ తరగతిలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి వారి పట్ల ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జడ్పీ సీఈవో దీక్షారైన ఆదేశించారు. మండలంలోని ముష్టికుంట్ల గ్రామంలో శుక్రవారం ఆమె పారిశుధ్య పనులు, డ్రై డే కార్యక్రమాలను పరిశీలించారు. అనంతరం ఉన్నత పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు మధ్యాహ్న భోజనం చేస్తుండటంతో అక్కడకు వెళ్లి భోజనాన్ని రుచి చూసి సంతృప్తి వ్యక్తం చేశారు. రోజు ఇలాగే వండుతున్నారా? లేక ఈ రోజు మాత్రమే భోజనం ఇలా ఉందా? అని అడిగారు. మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో వెనుక బడిన పిల్లల పట్ల ప్రత్యేకమైన శ్రద్ధ తీసుకునేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీవో రమాదేవికి సూచించారు. కిచెన్ గార్డెన్‌లో పిల్లలకు ఉపయోగపడే కూరగాయల మొక్కలను పెంచాలన్నారు. పాఠశాల ఆవరణలో మొక్కను నాటారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం భాగ్యలక్ష్మి, సిబ్బంది పాల్గొన్నారు.

నానో యూరియా పిచికారీతో పంటకు లాభాలు: ఏడీఏ



రైతులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఏ

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): పంటలపై నానో యూరియా పిచికారీతో అధిక లాభాలు ఉంటాయని మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర రైతులకు సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని మత్కేపల్లి, నాగులవంచ గ్రామాల్లో నిర్వహించిన క్షేత్ర ప్రదర్శనలో పాల్గొన్నారు. నానో యూరియా వాడకంతో మొక్కకు పోషకాలు ఎక్కువ మోతాదులో అందుతాయని, పర్యావరణ కాలుష్యం తక్కువగా ఉంటుందన్నారు. నానో యూరియాను ఎంపిక చేసిన కలుపు మందులలో కలిపి పిచికారీ చేయవచ్చునన్నారు. కార్యక్రమంలో ఏవో సోములపల్లి మానస, ఏఈవోలు కళ్యాణి, కార్తీక్, రైతులు పాల్గొన్నారు.

నేత్రదానం

సత్తుపల్లిరూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని విద్యానగర్ రోడ్డుకు చెందిన మల్లూరు వెంకట సత్యనారాయణ(71) అనారోగ్యంతో మృతిచెందారు. కుటుంబ సభ్యుల అనుమతి మేరకు లయన్స్ క్లబ్ ఆఫ్ సత్తుపల్లి ఆధ్వర్యంలో శుక్రవారం ఆయన నేత్రాలను సేకరించారు. మరొకరికి చూపును ఇచ్చేందుకు సహకరించిన మల్లూరు కుటుంబ సభ్యులను లయన్స్‌క్లబ్ బాధ్యులు అభినందించారు.

బాల కార్మికుల గుర్తింపు

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ పెట్రోల్ బంకులో పనిచేస్తున్న బాలకార్మికుడిని, తిమ్మినేనిపాలెంలో ఇసుక ట్రాక్టర్‌కు డ్రైవర్‌గా పనిచేస్తున్న మరో బాల కార్మికుడిని ఆపరేషన్ ముస్కాన్ బృంద సభ్యులు గుర్తించారు. మధిర అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ కొర్ని చందర్‌రావు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు తెలిపారు

ట్రాక్టర్‌లో డీజిల్ చోరీ

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నేరడ గ్రామ సమీపంలో ఉన్న నాగపూర్- అమరావతి జాతీయ రహదారి కార్యాలయం వద్ద ఉన్న ట్రాక్టర్‌లో గుర్తు తెలియని వ్యక్తులు 15 లీటర్ల డీజిల్‌ను చోరీ చేసినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై సూపర్‌వైజర్ కోట రవి శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

మాజీ ఏఎంసీ చైర్మన్ మోహన్‌రావు మృతి

మధిర రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మధిర మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్, మాటూరుపేట గ్రామ మాజీ సర్పంచ్, సీనియర్ కాంగ్రెస్ నాయకుడు అన్నెం మోహన్‌రావు శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతున్న ఆయన శుక్రవారం కన్నుమూశారు. ఆయన మృతికి మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్, రంగస్థల కళాకారుల సమాఖ్య అధ్యక్షుడు పుతుంబాక శ్రీకృష్ణప్రసాద్, మాజీ జడ్పీటీసీ సూరంశెట్టి నాగభూషణం, పలుగ్రామాల కాంగ్రెస్ నాయకులు సంతాపం తెలిపారు.

సీఎం సహాయనిధి చెక్కుల పంపిణీ

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగులవంచ గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు ఉపముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క సిఫారసు మేరకు మంజూరైన చెక్కులను పార్టీ అధ్యక్షుడు అంబటి వెంకటేశ్వర్లు శుక్రవారం అందజేశారు. కార్యక్రమంలో కంభం వీరభద్రం, ఆలస్యం బసవయ్య, ఎల్లంపల్లి చిన్న అప్పారావు, వెచ్చ మంగపతి, ముత్తినేని వెంకటేశ్వర్లు, నెల్లూరి రమేష్, ఆలస్యం శంకర్ తదితరులు పాల్గొన్నారు.

మధిరటౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): ఉపముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క సిఫారసుతో మంజూరైన సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కులను శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో మండల కాంగ్రెస్ అధ్యక్షుడు సూరంశెట్టి కిషోర్ పంపిణీ చేశారు. 21మందికి రూ.12.55 లక్షల విలువ గల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో నిడమానూరి వంశీ, తూమాటి నవీన్ రెడ్డి, చావా వేణు, బాలరాజు, కర్నాటి రామారావు, అద్దంకి రవి, జహంగీర్, రమణ, బాబు, సంగయ్య, చక్రీ తదితరులు పాల్గొన్నారు.

కారేపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న మండ పరిధిలోని విశ్వనాధపల్లి గ్రామానికి చెందిన తాతా కృష్ణవేణికి శుక్రవారం సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కును అందచేశారు. ఎమ్మెల్యే రాందాస్ నాయక్ సహకారంతో మంజూరైన రూ.14.500విలువగల చెక్కును స్థానిక మండల కాంగ్రెస్ నాయకులు తోటకూరి రాంబాబు అందజేశారు. కార్యక్రమంలో దమ్మాలపాటి రాంబాబు, పురం గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయండి

తల్లాడ, జూలై11(ఆంధ్రజ్యోతి): తల్లాడ మండలంలోని ఎన్‌ఎస్‌పీ కాలవలకు సీతారామ ప్రాజెక్టు ద్వారా సాగునీరు విడుదల చేయాలని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దగ్గుల రఘుపతిరెడ్డి కోరారు. శుక్రవారం స్థానిక కాంగ్రెస్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతులను ఇబ్బందులు దృష్టిలో పెట్టుకుని మంత్రి తుమ్మల , ఎమ్మెల్యే రాగమయి చొవర తీసుకని సీతారామ ద్వారా సాగునీరు విడుదలకు కృషిచేయాలని కోరారు. ఈసమావేశంలో మాజీ జడ్పీటీసీ మూకర ప్రసాద్, నాయకులు ఎర్రి కృష్ణారావు, కటికి కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

మతిస్థిమితం లేని ఇద్దరిని అన్నం ఫౌండేషన్‌కు తరలింపు

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైరా పోలీసుల చొరవతో స్థానికంగా మతిస్థిమితం లేకుండా రోడ్లపై తిరుగుతున్న ఇద్దరిని అన్నం ఫౌండేషన్‌కు తరలించారు. ఏసీపీ ఎంఏ.రెహ్మాన్ ఆధ్వర్యంలో ఎస్‌ఐ పి.రామారావు మతిస్థిమితం లేని ఇద్దరిని అన్నం ఫౌండేషన్ నిర్వాహకుడు శ్రీనివాసరావుకు అప్పగించారు. శుక్రవారం శ్రీనివాసరావు వైరా పోలీస్‌స్టేషన్‌కు వచ్చి మతిస్థిమితం లేని వారిని ఖమ్మం తరలించారు.

సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యం

» రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు



ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి శంకుస్థాపన చేస్తున్న రాయల నాగేశ్వరరావు

ముదిగొండ, జూలై 11 (ఆంధ్రజ్యోతి): నిరుపేదలకు సొంతింటి కల కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్ రాయల నాగేశ్వరరావు పేర్కొన్నారు. శుక్రవారం ముదిగొండ మండలం మేడేపల్లి గ్రామంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఇందిరమ్మ లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ లబ్ధిదారులకు విడతల వారీగా రూ.ఐదులక్షలు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కొమ్మినేని రమేష్‌బాబు, మాజీ జడ్పీటీసీ బులెట్‌బాబు, సొసైటీ చైర్మన్ తుపాకుల యలగొండస్వామి, సామినేని వెంకటయ్య, కందిమళ్ల వీరబాబు, దేవేందర్, భిక్షం, ఎల్లయ్య, గుడిపూడి బుచ్చిరామయ్య, ఉసికల రమేష్, వినోద్, పుల్లారెడ్డి పాల్గొన్నారు.

శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ కమిటీ ప్రమాణ స్వీకారం

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని స్నానాల లక్ష్మీపురంలోని ప్రముఖ పుణ్యక్షేత్రమైన శ్రీరామలింగేశ్వరస్వామి ఆలయ ధర్మకర్తల మండలి ప్రమాణస్వీకారోత్సవం అట్టహాసంగా జరిగింది. వైరా ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ధర్మకర్తల మండలి చైర్మన్‌గా దొడ్డా ఉషారాణి, సభ్యులుగా సుల్తాన్ పద్మ, మల్లు సీతమ్మ, మొగునూరి సత్యనారాయణ, తలారి నర్సింహారావు, గిరిగాని శ్రీనివాసరావు, సంగెపు రామకృష్ణతో దేవాదాయ ధర్మాదాయశాఖ జిల్లా అధికారులు ప్రమాణం చేయించారు. కార్యక్రమంలో తహసీల్దార్ కేవీ.శ్రీనివాసరావు, జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు పువ్వాళ్ల దుర్గాప్రసాద్, రాష్ట్ర మార్క్‌ఫెడ్ మాజీ వైస్‌చైర్మన్ బొర్రా రాజశేఖర్, టీపీసీసీ ప్రధాన కార్యదర్శి నూతి సత్యనారాయణ, వైరా, ఏన్కూరు, కొణిజర్ల, జూలూరుపాడ్ మండల కాంగ్రెస్ అధ్యక్షులు శీలం వెంకటనర్సిరెడ్డి, స్వర్ణ నరేందర్, వడ్డే నారాయణరావు, మంగీలాల్‌నాయక్, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు ఏదునూరి సీతరాములు, వైరా ప్రాజెక్టు కమిటీ మాజీ చైర్మన్ దొడ్డా పుల్లయ్య, వైరా మునిసిపల్ మాజీ చైర్మన్ సూతకాని జైపాల్, మల్లు రామకృష్ణ, నూతి వెంకటేశ్వరరావు, గణేష్, పమ్మి అశోక్, బీడీకే.రత్నం, పాలేటి నర్సింహారావు, వెంకటేశ్వరరావు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



సభ్యులకు నియామక పత్రాలను అందిస్తున్న ఎమ్మెల్యే రాందాస్‌నాయక్

వైరాలో తెలంగాణ ఇంజనీరింగ్స్ డే

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైరాలో శుక్రవారం తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో తెలంగాణ ఇంజనీరింగ్స్ డేను నిర్వహించారు. వైరా రిజర్వాయర్ రూపశిల్పి మీర్ అలీ నవాజ్ జంగ్ బహదూర్ చిత్రపటానికి రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాయకులు చింతనిప్పు చలపతిరావు, బాణాల శ్రీనివాసరావు, మల్లెంపాటి రామారావు, పైడిపల్లి సాంబశివరావు, కురుగుంట్ల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

ప్రపంచ జనాభా దినోత్సవం

ఎర్రుపాలెం,జూలై11(ఆంధ్రజ్యోతి): మండలంలోని బనిగండ్లపాడు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా ఆశాకార్యకర్తలు, వైద్య సిబ్బంది శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా వైద్యాధికారి ప్రశాంత్ మాట్లాడారు. ఈకార్యక్రమంలో డాక్టర్ కార్తీక్, రంజిత్, అశ్విన్, లక్ష్మీలోహిత, సీహెచ్‌వో కాంతమ్మ, పీహెచ్‌ఎన్ పద్మావతి, హెడ్‌నర్స్ పుష్ప, స్టాఫ్‌నర్స్‌లు రోజా, అరుణ, సూపర్‌వైజర్ వెంకటేశ్వరరావు, హెల్త్ అసిస్టెంట్ సాయిరెడ్డి, ఏఎన్‌ఎం సుగుణ పాల్గొన్నారు.

వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం

మధిరటౌన్, జూలై11(ఆంధ్రజ్యోతి): మధిర మునిసిపాలిటీలోని పలు వార్డుల్లో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు శుక్రవారం పలు వార్డుల్లో ఫ్రైడే డ్రైడే కార్యక్రమం నిర్మించారు. మునిసిపల్ కమిషనర్ సంపత్ కుమార్ రెండో వార్డులో కార్యక్రమాన్ని పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ సిబ్బంది, మెప్మా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ గురించి మాట్లాడే అర్హత కవితకు లేదు

కల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): సీపీఐ గురించి నోరు జారవద్దని, సీపీఐ గురించి మాట్లాడే హక్కు తెలంగాణ జాగృతి నాయకురాలు కవితకు లేదని సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి దండు ఆదినారాయణ హెచ్చరించారు. శుక్రవారం కల్లూరులో జరిగిన సీపీఐ మండల సమావేశంలో ఆయన ప్రసంగించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాధ్యక్షుడు వేము రాంబాబు, మండల సీపీఐ కార్యదర్శి దమాల దయకర్, పిచ్చయ్య తదితరులు పాల్గొన్నారు.

నవోదయకు అన్నదమ్ముల ఎంపిక

ఏన్కూరు, జూలై11(ఆంధ్రజ్యోతి): నవోదయ ప్రవేశ పరీక్షా ఫలితాల్లో ఇద్దరు అన్నదమ్ములు సత్తా చాటారు. ఉషోదయ పాఠశాలలో 5వతరగతి చదువుతు శిక్షణ పొందిన డి.యశ్వంత్‌రామ్, డి. ఆదిత్య అన్నదమ్ములు వీరు సీట్లు సాధించారు. నవోదయకు ఎంపికైన వారిని పాఠశాల యాజమాన్యంతోపాటు తల్లిదండ్రులు, గ్రామస్థులు అభినందించారు.

పేద విద్యార్థులకు విద్యాసామగ్రి పంపిణీ

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): మండలంలోని పాలడుగు, గొల్లెనపాడు గ్రామాల్లో శుక్రవారం గ్రేస్ సర్వీస్ సొసైటీ స్వచ్ఛంద సేవసంస్థ ఆధ్వర్యంలో ఆసంస్థ చైల్డ్‌కేర్ సెంటర్‌కు చెందిన 147మంది విద్యార్థులకు వైరా ఎస్‌ఐ పి.రామారావు చేతులమీదుగా విద్యాసామగ్రిని పంపిణీ చేశారు. విద్యార్థులకు స్కూల్ బ్యాగ్స్, నోట్‌పుస్తకాలు, పలకలు అందజేశారు. పాలడుగు హైస్కూల్ ప్రధానోపాధ్యాయుడు ఇమానియేల్, సెంటర్ ఇన్‌చార్జ్ మోదుగు వినోద్‌కుమార్, రోజమ్మ, మురళీకృష్ణారెడ్డి, సతీష్, రాజేష్, మహబూబీ, మణి పాల్గొన్నారు.

పూర్తిస్థాయిలో నీటిని విడుదల చేయాలి

వైరా, జూలై 11 (ఆంధ్రజ్యోతి): వైరా రిజర్వాయర్ ఆయకట్టుకు పూర్తిస్థాయిలో సాగునీరు విడుదల చేయాలని కోరుతూ తెలంగాణ రైతుసంఘం ఆధ్వర్యంలో శుక్రవారం ఎమ్మెల్యే మాలోతు రాందాస్‌నాయక్‌కు వినతిపత్రం సమర్పించారు. వరినారుమళ్లకు అరకొరగా సాగునీటిని అనధికారికంగా విడుదల చేశారని గుర్తుచేశారు. అయితే అధికారికంగానే పూర్తిస్థాయిలో ఆయకట్టులో ఖరీఫ్ వరిసాగుకు నీరు విడుదల చేయాలని ఆవినతిపత్రంలో కోరారు. అలాగే నేషనల్ హైవే అథార్టీ గ్రీన్‌ఫీల్డ్ హైవే నిర్మాణ సమయంలో ధ్వంసమైన కాల్వలకు యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయించాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ రైతుసంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు పాల్గొన్నారు.

కల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి): తక్షణమే సాగర్ నీరు విడుదల చేసి కల్లూరు సర్కిల్ పరిధిలో ఎండిపోతున్న వరి పైరును కాపాడాలని సీపీఎం సత్తుపల్లి డివిజన్ కార్యదర్శి సత్యనారాయణరెడ్డి రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కల్లూరులో సీపీఎం కార్యాలయంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మండల కార్యదర్శి మాదాల వెంకటేశ్వరరావు, డివిజన్ నాయకుడు తన్నీరు కృష్ణార్జునరావు పాల్గొన్నారు.

అర్హులకు ఇందిరమ్మ ఇళ్లు ఇవ్వాలని ఆందోళన



మధిర రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

మధిర రూరల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): అర్హులైన పేదలందరికీ ఇందిరమ్మ ఇళ్లు మంజూరు చేయాలని, ఇందిరమ్మ కమిటీలను రద్దుచేయాలని డిమాండ్ చేస్తూ శుక్రవారం మధిరలో సీపీఎం పార్టీ ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద ఆందోళన నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సీపీఎం మండల కార్యదర్శి మందా సైదులు, జిల్లా నాయకుడు శీలం నర్సింహారావు మాట్లాడారు. మధిర మండలంలో ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన జాబితాలో 90శాతం అధికార పార్టీ కార్యకర్తలే ఉన్నారని ఆరోపించారు. అనంతరం సమస్యతో కూడిన వినతిపత్రాన్ని తహసీల్దార్‌కు అందజేశారు. కార్యక్రమంలో పాపినేని రాంనర్సయ్య, పట్టణ కార్యదర్శి పడకంటి మురళీ, వూట్ల శంకర్‌రావు, బాజినేని వెంకటనర్సయ్య, వడిత్యా లాలు, అంగడాల అమరయ్య, మధు పాల్గొన్నారు.

సాగర్ నీరు అందించాలి

కల్లూరు, జూలై 11 (ఆంధ్రజ్యోతి) వానాకాలం సీజన్‌లో కల్లూరు సర్కిల్ పరిధిలో సాగర్ ఆయకట్టు కింద వేసిన వరి నారు మడులు, సాగు చేసి ఎండిపోతున్న వరిపైరుకు తక్షణమే సాగునీరు అందించి రైతులను ఆదుకోవాలని కల్లూరు మండల కాంగ్రెస్ నాయకులు, రైతులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరారు. కల్లూరులో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు పసుమర్తిచందరావు, మాజీ జడ్పీ కోఆప్షన్ సభ్యుడు ఎస్‌కె యాకుబ్ అలీ రైతాంగం పక్షాన మాట్లాడారు. జక్కంపూడి కిషోర్, బంకా బాబు, యాసా శ్రీకాంత్, కిష్టంశెట్టి ఏడుకొండలరావు, బాల నాగేశ్వరారావు, వెంకటేశ్వరారావు, వెంగళరావు, గురవయ్య పాల్గొన్నారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చందర్‌రావు

రేపు శాకాంబరిగా కోటమైసమ్మతల్లి దర్శనం



కారేపల్లి, జూలై11(ఆంధ్రజ్యోతి): మండలపరిధిలోని ఉసిరికాయలపల్లిలోని శ్రీకోటమైసమ్మతల్లి రేపు ఆదివారం శాకాంబరిమాతగా భక్తులకు దర్శనం ఇవ్వనున్నారు..ఆషాడమాసం సందర్భంగా ఆలయంలో కార్యక్రమాలు ప్రారంభమై ఉత్సవాలు కొనసాగుతున్నాయని ఆలయ చైర్మన్ డాక్టర్ పర్సా పట్టాభీ రామారావు, ఈవో వేణుగోపాలచార్యులు, పూజారి కైలాష్ శర్మ తెలిపారు. ఆదివారం అమ్మవారిని 56రకాల కూరగాయలతో అలంకరించారు.

బండి సంజయ్ జన్మదిన వేడుకలు

తల్లాడ, జూలై11(ఆంధ్రజ్యోతి): తల్లాడలో కేంద్ర మంత్రి బండి సంజయ్ జన్మదిన వేడుకల ను బీజేపీ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా స్థానిక మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులకు పండ్లు పంపిణీ చేశారు. ఈకార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు ఈవీ రమేష్, మండల ప్రధాన కార్యదర్శులు పెరికే కిరణ్, రాయల రమేష్, యద్దనపుడి శ్రీనివాసరావు, కార్యదర్శి చల్లా నరేష్, మహిళ మోర్చా మండల అధ్యక్షురాలు నన్నపనేని శారద, సంగీతం సాయిచంద్, కటికి నరసింహారావు పాల్గొన్నారు.

పొటాష్ విక్రయించడం లేదని రైతుల ఫిర్యాదు



స్టాకు రిజిస్టర్ పరిశీలిస్తున్న ఏవో శ్రీనివాసరావు

సత్తుపల్లి, జూలై 11 (ఆంధ్రజ్యోతి):సత్తుపల్లి పట్టణంలో కొందరు ఎరువుల డీలర్లు పొటాష్, యూరియా స్టాకు ఉన్నా విక్రయించటం లేదని రైతులు ఆరోపిస్తున్నారు. దీనిపై వ్యవసాయాధికారి వై.శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. సత్తుపల్లి పట్టణం, మండలానికి చెందిన కొందరు రైతులు యూరియా కోసం వస్తే స్టాకు లేదని సమాధానం చెబుతున్నారని, పొటాష్ గోదాముల్లో నిల్వ ఉన్నా డీలర్లు లేదని చెబుతూ రైతులను వెనక్కి పంపుతున్నారని ఆరోపించారు. శుక్రవారం పోటీష్ కొనుగోలు చేసేందుకు కొందరు రైతులు డీలర్ల వద్దకు రాగా లేదని చెప్పారని రైతు సంఘం నాయకుడు మలిరెడ్డి పూర్ణచంద్రారెడ్డి ఆరోపించారు. తాను స్వయంగా 18 బస్తాల పోటీష్ కావాలని ఒక డీలర్ వద్దకు వెళ్లగా స్టాకు లేదన్నారని, వేరే షాపునకు వెళ్లగా అక్కడ 15 బస్తాలు మాత్రమే ఇస్తామని చెప్పారని అన్నారు. దీనిపై ఆయన ఏవో శ్రీనివాసరావుకు ఫిర్యాదు చేశారు. దీంతో ఏవో పట్టణంలోని డీలర్ల గోడౌన్లను తనిఖీ చేశారు. స్టాకు రిజిస్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక గోదాములో 150 బస్తాలు, మరో డీలర్‌కు చెందిన గోదాములో 45 బస్తాలు స్టాకు ఉన్నట్లు ఏవో గుర్తించారు. స్టాకు లేదని చెప్పిన ఒక డీలర్‌పై ఏవో శ్రీనివాసరావు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పూర్ణచంద్రారెడ్డి విలేకర్లతో మాట్లాడుతూ కొద్ది రోజుల్లో పొటాష్ దర ను రూ.1850లకు కేంద్ర ప్రభుత్వం పెంచున్నట్లు ప్రకటించిందని దీనిని దృష్టిలో ఉంచుకొని ప్రస్తుతం రూ.1535లు ఉన్న పొటాష్‌ను విక్రయించటం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బాలపుల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

పగిడేరుపై హైలెవల్ బ్రిడ్జి నిర్మించాలని ఆందోళన

కొణిజర్ల, జూలై11(ఆంధ్రజ్యోతి): సమస్య పరిష్కారం కాక ప్రజలు రోడెక్కారు. వర్షాకాలం వస్తే చాలు వర్షాలకు రాకపోకలు నిలిచిపోవలసిందే. ఏ అధికారికి చెప్పిన, ఏ నేతకు చెప్పిన సమస్య పరిష్కారం కాకపోవడంతో శుక్రవారం ఆయా గ్రామాల ప్రజలు రైతుసంఘం జిల్లా ప్రధానకార్యదర్శి బొంతు రాంబాబు ఆధ్వర్యంలో పగిడేరు వద్ద ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా బొంతు రాంబాబు మాట్లాడుతూ వర్షాకాలం వస్తే పల్లిపాడు నుంచి అంజనాపురం ఏన్కూర్ వరకు వెళ్లే ప్రజలు నానా అవస్థలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వర్షాకాలం వస్తే రాకపోకలు నిలిచిపోతున్నప్పటికి సమస్య అధికారులకు, నేతలకు పట్టడంలేదని ఆరోపించారు. ప్రజల ఇబ్బందులు అర్థం చేసుకొని లాలాపురం-తీగలబంజర మధ్య రహదారి పగిడేరు పై హైలెవల్ బ్రిడ్జి నిర్మాంచాలని డిమాండ్ చేశారు. తమసమస్యను ఎవరూ పట్టించుకోవడంలేదని ఈ సందర్భంగా ఆయా గ్రామాల ప్రజలు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల ప్రజలు, నాయకులు సంక్రాంతి నర్సయ్య, దొడ్డపునేని కృష్ణార్జునరావు, మిద్దె రామారావు, కట్టా రాంబాబు, బానోతు భరత్, మహాబూబ్‌అలీ, బాణాల శ్రీనివాసరావు, చల్లా వెంకటనారాయణ, అనుమోలు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి

చింతకాని, జూలై 11(ఆంధ్రజ్యోతి): కొణిజర్ల మండలం కొండవనమాల గ్రామానికి చెందిన హరికొట్ల శ్రీను(24) అను యువకుడు ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతూ శుక్రవారం మృతిచెందాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో ల్యాబ్ టెక్నిషియన్‌గా పనిచేస్తున్న శ్రీను ఓ యువతిని ప్రేమిస్తున్నాడు. ప్రేమించిన యువతి కొద్ది రోజుల నుంచి మాట్లాడకపోవడంతో తీవ్ర మనస్థాపం చెందాడు. దీంతో ఈ నెల 3న అర్ధరాత్రి మండలంలోని కొదుమూరు గ్రామ సమీపంలోని గంగమ్మ తల్లి ఆలయం వద్ద పురుగుల మందు తాగాడు. విషయాన్ని తాను పనిచేస్తున్న ఆస్పత్రి సిబ్బందికి తెలియజేయగా వెంటనే వారు చికిత్స నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు తెలిపారు. మృతుని తండ్రి నాగరాజు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్‌ఐ నాగుల్‌మీరా కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

బోనకల్ పీహెచ్‌సీలో టీబీ వ్యాధిపై శిక్షణ

బోనకల్, జూలై 11 (ఆంధ్రజ్యోతి): బోనకల్ పీహెచ్‌సీలో శుక్రవారం పెడియాట్రిక్ టీబీ వ్యాధిపై శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వైద్యాధికారి స్రవంతి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో వైద్య సిబ్బంది వెంకట్, గంటయ్య, సందీప్, శ్రీకాంత్, శిరీష తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలి

» మునిసిపల్ కమిషనర్ నరసింహా

సత్తుపల్లిరూరల్, జూలై11 (ఆంధ్రజ్యోతి): కార్మికులు తమ ఆరోగ్యంపై శ్రద్ధ వహించాలని మునిసిపల్ కమిషనర్ కే.నరసింహ అన్నారు. 100రోజుల కార్యాచరణ ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా గంగారం పీహెచ్‌సీ ఆధ్వర్యంలో స్థానిక మునిసిపల్ కార్యాలయంలో కార్మికులకు ఉచితగా మెగా వైద్య శిబిరాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ టీ.సీతారామ్, డా.ఆర్.అవినాష్, కాంగ్రెస్ పార్టీ నాయకులు డాక్టర్ మట్టా దయానంద్ విజయకుమార్, చల్లగుళ్ల నరసింహారావు, ఎండీ.కమల్‌పాషా, చెన్నారావు, మునిసిపల్ సిబ్బంది, కార్మికులు పాల్గొన్నారు.



కార్మికురాలికి పరీక్షలు చేస్తున్న దయానంద్